J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 42 20.3.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# కూటమి నేతల నేరాలు - ఘోరాలు

- వరుస వివాదాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు
- లైంగిక వేధింపులు, డ్రగ్స్ కేసుల్లో తీవ్ర ఆరోపణలు
- చంద్రబాబు, పవన్ హెచ్చరికలు బేఖాతర్

**తి**రుగులేని విజయంతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వానికి, తమ పార్టీల నాయకులే గుదిబండలుగా మారుతున్నారు. వరుస వివాదాల్లో చిక్కుకుని ఇటు పార్టీ అటు ప్రభుత్వ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. ముఖ్యంగా లైంగిక వేధింపులు, డ్రగ్స్, మైన్స్, వైన్స్, సెటిల్‌మెంట్లతోపాటు కబ్జాలకు పాల్పడుతూ దొరికిన మేరకి దోచేస్తున్నారు.

**త**మ పార్టీ అధిష్టానాలు ఎంత హెచ్చరించినా, తమ అధినేతలు ఎన్నిసార్లు వార్నింగ్‌లు ఇచ్చినా, కుక్కతోక వంకరే అన్న చందంగా పెడదారి పడుతూ, కూటమి పరువును బజారుకీడుస్తున్నారు. తాజాగా ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంతో కూటమి నేతల బరితెగింపు వ్యవహారాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

## ఒకరా ఇద్దరా..?
## జాబితా చాంతాడంత!

ఒకవైపు చేసింది చెప్పుకోలేక, చేయాల్సినవి సకాలంలో చేపట్టలేక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆపసోపాలు పడుతున్న విషయం తెలిసిందే. అటు కేంద్ర ప్రభుత్వ సహాయంతో పోలవరం, అమరావతిని పూర్తిచేయడం ద్వారా చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో

2లో

- వివేక హత్య కేసు




# విశ్వాసం కోల్పోతున్న 'ఛీ'బీఐ


- ఏడేళ్ళుగా వీడని మిస్టరీ
- చేతులెత్తేసిన విచారణ అధికారులు
- సునీత వాదన అరణ్యరోదనే!

**మా**జీ మంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డికి స్వయానా సోదరుడు వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు వ్యవహారం అంతఃపుర రహస్యంగా మిగిలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

2లో







శ్రీ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి గారు

జననం : 15.10.1944 నిర్యాణం : 23.03.2020

## ఆరవ వర్ధంతి

అవధులు లేని మీ ప్రేమానురాగాలు సదా స్మరణీయం
అనితరసాధ్యమైన మీ భక్తితత్వం సదా ఆచరణీయం
అజరామరమైన మీ కీర్తి చిరస్మరణీయం

మాకు స్ఫూర్తిప్రదాత, మా కుటుంబ అభివృద్ధికి బంగారు బాటలు వేసిన విధాత

**కీ॥శే॥ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి గారి**

6వ వర్ధంతి సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

**ఆల్తూరు సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు
**ఆల్తూరు గిరీష్‌రెడ్డి - లత**
**ఆల్తూరు మహేష్‌రెడ్డి - రాధిక**

మనుమరాళ్ళు, మనుమళ్ళు
**సాహిని - అనురాగ్**
**సాయి సంతోష్, సాయి నితీష్ - కీర్తి**
**సాయి అనీష్**

# కూటమి నేతల నేరాలు - ఘోరాలు

(మొదటిపేజీ తరువాయి)

లిఖించుకోవాలని, నవ్యాంధ్ర నిర్మాతగా పేరు గడించాలని ఆయన రోజుకు 18 గంటలు కష్టపడుతూ, ఏడున్నర పదుల వయస్సులోనూ అలుపు సొలుపు లేకుండా పనిచేస్తున్నారు. ఇక ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా మరో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం మనుగడ సాగించాలంటే అందరూ కలిసికట్టుగా పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలని ఉద్బోధ చేస్తున్నారు. యువ కెరటం లోకేష్ సైతం ఎమ్మెల్యేలు, ఎంపీలను కలుపుకుపోయేందుకు ఆత్మీయ సమావేశాల పేరిట ప్రజాప్రతినిధులను అక్కున చేర్చుకునేందుకు తాపత్రయ పడుతున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు మాత్రం మళ్లీ అవకాశం వస్తుందో.. రాదో..? అన్న చందంగా అధికార దాహంతో అడ్డగోలు పనులు చేస్తూ రెచ్చిపోతున్నారు. తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తూ తాము కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్నారు.

తిరుపతి జిల్లా సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలం తమ పార్టీ మహిళా కార్యకర్తపై లైంగిక దాడికి పాల్పడడం అప్పట్లో పెను సంచలనం కలిగించింది. స్వయంగా బాధితురాలే మీడియా ముందుకొచ్చి ఎమ్మెల్యే తనను అత్యాచారం చేశారంటూ వీడియోలు విడుదల చేయడం కూటమి ప్రభుత్వాన్ని షాక్‌కు గురిచేసింది. హైకోర్టు వరకు ఈ వ్యవహారం చేరడం, ఫోక్సో కేసులు నమోదు కావడంతో చంద్రబాబు సదరు టీడీపీ ఎమ్మెల్యేని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయినా కొందరు నేతల్లో కనువిప్పు కలగలేదు. ఆదిమూలం కోవలోనే, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, ఆముదాల వలస ఎమ్మెల్యే కూనా రవికుమార్ మహిళా వేధింపుల వ్యవహారాల్లో చిక్కుకుని పార్టీకి చెడ్డపేరు తెచ్చారు. కస్తురిబా పాఠశాల ప్రిన్సిపల్‌ను కూనా రవికుమార్ వేధించినట్లు నిర్ధారణ కావడం ప్రభుత్వ ఉద్యోగుల్లోనూ ఆగ్రహం కలిగించింది. అలాగే మంత్రి సంధ్యారాణి పీఏ, ఓ మహిళా ఉద్యోగిపై లైంగిక దాడి చేశారనే ఆరోపణలు రావడం, విశాఖ తూర్పు ఎమ్మెల్యే అనుచరుడు మద్ది శ్రీనివాస్ వివాహేతర సంబంధాల వ్యవహారం వెలుగు చూడడం టీడీపీకి తలనొప్పిగా మారాయి. ఇక జనసేనకు చెందిన రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తనపై అత్యాచారం చేసి ఐదుసార్లు అబార్షన్ చేయించారంటూ ఓ మహిళ మీడియా ముందుకు రావడం పవన్ కళ్యాణ్ పార్టీ పరువును అథఃపాతానికి తీసుకెళ్లింది. పైగా అసెంబ్లీలో నుంచి న్యూడ్ వీడియోలతో సదరు మహిళలతో ఎమ్మెల్యే చాట్ చేయడం వంటి వార్తలు రాష్ట్రవ్యాప్తంగా కూటమికి మైనస్‌గా మారాయి. అంతకుముందు జనసేత నేతలు కోట వినుత తన డ్రైవర్ హత్యకేసులో ఏకంగా జైలుకెళ్లిరాగా, ఆ పార్టీ నాయకుడు కిరణ్ రాయల్ ఓ మహిళతో ఇల్లీగల్ ఎఫైర్ నడపడం దాన్ని ప్రతిపక్ష పార్టీలు బట్టబయలు చేయడం కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాయి.

## బీఆర్ నాయుడు, పుట్టా మహేష్‌యాదవ్ వ్యవహారంతో..

ఇక తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న వీడియోలు నెట్టింట చక్కర్లు కొట్టడం, ఆయన తర్వాత మీడియా సమావేశం ఏర్పాటుచేసి తమది 30 ఏళ్ల అనుబంధం అని చెప్పడంతో చంద్రబాబు ప్రభుత్వానికి తలబొప్పిగట్టింది. పైగా ఆ వీడియోల్లో తప్పేముం దంటూ బీఆర్ నాయుడు ప్రశ్నించడంతో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసింది. పాడు పనులకు తిరుమల కేంద్రమైందంటూ ఆరోపణలు గుప్పించింది. ఇక కోట వినుత డ్రైవర్ హత్యకేసులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాత్రపై వార్తలు రావడం, శ్రీకాళహస్తిలో ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో సుధీర్‌రెడ్డి సెంటర్ పాయింట్ కావడం, అక్రమ మైనింగ్ వ్యవహారంలో చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్‌పై ఆరోపణలు వెల్లువెత్తడం, మరో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌పై భూకబ్జా, సెటిల్‌మెంట్‌లకు పాల్పడ్డారంటూ బాధితులు రోడ్డెక్కడం వంటి సంఘటనలు కూటమి ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చాయనడంలో సందేహం లేదు. తాజాగా ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ తెలంగాణ డ్రగ్స్ పార్టీలో కనిపించడం, అక్కడి పోలీసులు దీనిపై కేసు నమోదు చేయడం చకచకా జరిగిపోయాయి. దీంతో కూటమి ప్రభుత్వానికి మరో మరక అంటింది. తెలంగాణ ఈగల్ టీం చేపట్టిన దర్యాప్తులో సదరు ఎంపీకి డ్రగ్స్ పాజిటివ్ రావడం సంచలనం రేపింది. దీన్నుంచి బయటపడడానికి కూటమి పెద్దలు ఆపసోపాలు పడుతున్నట్లు సమాచారం. ఆర్థికబలం ఉన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడే ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కావడంతో ఏటూ తేల్చుకోలేక టీడీపీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఈ విషయాన్ని జాతీయ స్థాయిలో రచ్చరచ్చ చేసి కూటమి ప్రభుత్వ నిర్వాకాన్ని ఎండగట్టేందుకు ప్రతిపక్ష వైసీపీ పావులు కదుపుతోంది. దీంతో, ఏపీ రాజకీయం నేరాలు-ఘోరాలు వేదికగా రసవత్తరంగా సాగుతోంది. ఏదేమైనా కొందరు కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు చేస్తున్న అనైతిక పనుల కారణంగా ప్రభుత్వం పరువు మురుగుకాలవలో కలిసిపోతుందనే వాదనలు జోరందుకుంటున్నాయి. ఇక టీడీపీ, జనసేన నాయకులకు తామేమీ తక్కువ కాదంటూ బీజేపీకి చెందిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుమారుడు కూడా డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటుండడం కూటమి ప్రభుత్వ దుస్థితికి అద్దం పడుతోంది.

ఏదేమైనా మరికొంత కాలం ఇదే పరిస్థితి కొనసాగితే కూటమికి నూకలు చెల్లేకాలం దగ్గర పడినట్లే అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. మరి చంద్రబాబు ప్రభుత్వం కట్టుతప్పుతున్న తమ నేతలను కట్టడిచేస్తుందో లేక చూసీచూడనట్లు వదిలేసి మూల్యం చెల్లించుకుంటుందో వేచి చూడాలి..!

# విశ్వాసం కోల్పోతున్న 'ఛీ'బీఐ

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసు విచారణ ఏడేళ్లుగా మూడడుగులు ముందుకి, ఏడడుగులు వెనక్కి అనేలా సాగుతోంది. తాజాగా సీబీఐ నాంపల్లి కోర్టులో వేసిన మూడో చార్జిషీట్‌లోనూ సూత్రధారుల ప్రస్తావన తేలేదు. దీంతో ఈ కేసు విచారణ ఇక ముగిసినట్లే అన్న వాదనలు తెరమీదకొస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని చాలా కేసులను దర్యాప్తు పేరుతో ఏళ్లకేళ్లు నాన్చి ఆ తర్వాత చేతులెత్తేసిన సీబీఐ, ఈ కేసులోనూ అదే చేసిచూపిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే దేశంలోనే అత్యంత విశ్వసనీయ సంస్థ, అత్యాధునిక సాంకేతిక వనరులు, చురుకైన అధికారులకు పేరుగాంచిన సీబీఐ, పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నట్లుగా మారింది. ఇప్పటికే ఎన్నో ప్రధాన కేసులను నీరుగార్చిన ఆ సంస్థ అధికారులు వివేకానందరెడ్డి హత్య కేసులోనూ విచారణను మమా అనిపించారన్న విమర్శలు జోరందుకున్నాయి. మొత్తం మీద ఏదైనా ఒక కేసు సీబీఐకి వెళ్తే ఆ కేసు దార్యెంతరికి చేరినట్లే అనే ఆరోపణలకు వివేకానందరెడ్డి హత్య కేసు ఉదాహరణగా నిలుస్తోందనడంలో సందేహం లేదు. ఫలితంగా సీబీఐ అంటే దేశ ప్రజల దృష్టిలో 'ఛీ' బీఐ అనేలా పరిస్థితులు దిగజారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## కేసు నేపథ్యం ఇదీ..!

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయి కీర్తిని సంపాదించుకున్న దివంగత ముఖ్యమంత్రి. ఆ మహానేతకు తమ్ముడు, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ఎన్నో పదవులను అధిరోహించిన సీనియర్ నేత వైఎస్ వివేకానందరెడ్డి. అంతటి ఘనచరిత్ర ఉన్న ఆయన 2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు. దుండగులు ఆయన్ని గొడ్డలితో శరీరం తూట్లుపడేలా నరికారు. రక్తపుమడుగులో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ ఆయన మరణించారు. ఈ కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. కొందరు దీన్ని తొలుత గుండెపోటని తర్వాత ఆత్మహత్య అని నమ్మించే ప్రయత్నం చేశారనే ఆరోపణలున్నాయి. అయితే ఆయన ఇంటి గోడలపై రక్తపు మరకలు, వివేకా శరీరంపై తీవ్రగాయాలు ఉండడంతో పోలీసులు హత్యగా నిర్ధారించారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. తర్వాత వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు ఈ కేసు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదనే ఆరోపణలున్నాయి. పైగా హత్యకు సూత్రధారులనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వై.ఎస్.భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు, ఎంపీ అవినాష్‌రెడ్డిని జగన్ ప్రభుత్వం కాపాడేందుకు యత్నించిందనే విమర్శలు కూడా వెల్లువెత్తాయి. దీంతో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత సుప్రీంకోర్టులో వరుసగా అదనపు పిటిషన్లు దాఖలు చేసి, అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వంపై కూడా ఆమె పలు విమర్శలు చేశారు. నిందితులను ప్రభుత్వ అధినేతే కాపాడుతున్నారంటూ సంచలన ఆరోపణ చేయడమే కాకుండా, గత ఎన్నికల్లో అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా వైఎస్ షర్మిలతో కలిసి ప్రచారం కూడా చేశారు. ఇక ఈకేసులో మొత్తం ఆరుగురు నిందితులపై సీబీఐ అభియోగాలు నమోదు చేసింది. వారిలో వివేకా నందరెడ్డి డ్రైవర్ దస్తగిరి.. హత్య తామే చేశామంటూ అప్రూవర్‌గా మారారు. ఇక ప్రధాన సాక్షులుగా భావించిన వాచ్‌మెన్ రంగన్న సహా ఆరుగురు సాక్షులు హత్యకు గురవడం కూడా సంచలనం కలిగించింది. ఈ నేపథ్యంలో నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో మూడో చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ అధికారులు ఈ కేసులో ఇక విచారణ చేసేందుకు ఏం లేదంటూ ప్రకటించడంతో ఈ కేసులో సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న "పెద్ద" తలల ప్రస్తావన లేకుండా కేసు ముగిసిపోయిందనే విమర్శలు జోరందుకున్నాయి. ఏడేళ్లు విచారణ చేసి, కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా సీబీఐ పట్టలేకపోయిందని వివేక కుమార్తె సునీత ఆవేదన వ్యక్తం చేశారు.

## సమాధానం లేని శేషప్రశ్నలెన్నో...?

- కడప ఎంపీ సీటు కోసం నెలకొన్న పోటీయే వివేకా హత్యకు కారణమైందన్న ఆరోపణలను సీబీఐ ఎందుకు పట్టించుకోలేదు..?
- తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాష్‌రెడ్డిని కనీసం అరెస్టు చేసే ధైర్యం, తెగువ సీబీఐకు ఎందుకు లేకుండా పోయింది..?
- అర్థరాత్రి సమయంలో వైఎస్ భారతీరెడ్డి రిసీవ్ చేసుకున్న ఫోన్‌కాల్‌పై ఎందుకు విచారణ చేయలేదు..?
- నిందితులు చెప్పినట్లు రూ.40 కోట్ల సుపారీ డబ్బు ఎవరి నుంచి వెళ్లింది..? ఎవరు తీసుకొచ్చి ఇచ్చారో ఎందుకు విచారణ చేయలేదు..?
- ఘటనా స్థలంలో రక్తపు మరకలు ఎందుకు తుడిచేశారు..? ఎవరి ప్రోద్బలంతో ఇది జరిగిందో ఎందుకు విచారణ చేయలేదు..?
- మృతదేహానికి కుట్లు, బ్యాండేజ్ ఎవరు వేశారు..? ఎవరు వేయమని చెప్పారు..? అన్న విషయం ఎందుకు విచారణ చేయలేదు..?
- కుమార్తె సునీత, ఆమె తల్లి రాకముందే, పోస్టుమార్టానికి కూడా పంపకముందే అంత్యక్రియల ఏర్పాట్లను ఎందుకు చేశారు. అనే అంశాన్ని విచారణలో ఎందుకు విస్మరించారు.?
- వివేకకు రెండో వివాహం జరిగి ఉంటే ఎందుకు సీబీఐ దాన్ని పట్టించుకోలేదు..?
- వివేక వారసత్వ అంశం కూడా ఆయన హత్యకు కారణమై ఉండే అవకాశం ఉందన్న వాదనలు ఎందుకు సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదు..? అనే ప్రశ్నలకు సమాధానం లేకుండానే సీబీఐ తన విచారణను ముగించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## దేశవ్యాప్తంగా ఇతర కేసుల్లోనూ..

ఒక్క వివేకానందరెడ్డి హత్యకేసులోనే కాదు, దేశవ్యాప్తంగా చాలా కేసుల్లో సీబీఐ తన నిస్సహాయతను, చేవలేనితనాన్ని చాటుకుంది.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసు 17 సంవత్సరాల పాటు సాగింది. చివరికి సీబీఐ ఈ కేసులో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని తేల్చడంతో అసలు దోషి ఎవరో తెలియకుండానే కేసు ముగిసిపోయింది. ఈ కేసులో తమకు న్యాయం జరగలేదని, కనీసం తమ బిడ్డ అవశేషాలైనా ఇస్తే మతాచారం ప్రకారం అంత్యక్రియలు చేసుకుంటామని ఆమె తల్లిదండ్రులు కోర్టును వేడుకోవడం గమనార్హం.

అలాగే 2017లో అనుమానాస్పద స్థితిలో మరణించిన సుగాలిప్రీతి కేసులోనూ దోషిని సీబీఐ తేల్చలేకపోయింది. అలాగే తగినన్ని వనరులు లేవంటూ తమను ఈ కేసు విచారణ నుంచి తప్పించాలని ఏకంగా కోర్టును సీబీఐ అధికారులు కోరడం సీబీఐ ప్రతిష్టనే దిగజార్చింది. 2008లో యూపీలోని నొయిడాలో హత్యకు గురైన ఆరుషీ తల్వార్, 2012లో విగతజీవిగా పడున్న హీనాబోరా హత్య కేసులోనూ అసలు దోషులెవరో సీబీఐ తేల్చలేకపోయింది. మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ భార్య సునందా పుష్కర్ హత్యకేసులోనూ సీబీఐ ఏం చేయలేక చేతులెత్తేసింది.

## సీబీఐ ఉండి ఏం లాభం...?

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే సీబీఐ కేంద్ర ప్రభుత్వ పెద్దల అడుగులకు మడుగులొత్తే సంస్థగా మారిపోయిందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా అవినీతి, అక్రమాలకు నిలయంగా మారి కొందరి నేతలకు సీబీఐ జేబు సంస్థగా స్థిరపడిపోయిందనే వాదనలు కూడా ఉన్నాయి. సత్యం, న్యాయం, ధర్మాన్ని గెలిపిస్తుందనే నమ్మకం సీబీఐపై దేశ ప్రజలకు లేదంటే అతిశయోక్తి కాదేమో. అసలు సీబీఐ నిర్వహణే అత్యంత హీనంగా, దీనంగా మారిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కీలక కేసుల్లో సీబీఐ పలాయనవాదం ఫలితంగా నేరగాళ్ల ముందు న్యాయం మోకరిల్లుతోందని, నేరగాళ్ల వలలో చిక్కి న్యాయదేవత విలవిలలాడుతోందని సగటు పౌరుడు భావిస్తుండడం గమనార్హం. ఒక్కమాటలో చెప్పాలంటే చేతగాని, చేవలేని సీబీఐ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, దర్యాప్తు పేరుతో సాగిసాగి చివరికి సాగిలాపడడం తప్ప సీబీఐ చేసేదేమీ లేదని స్పష్టమవుతోంది. అందుకే దేశప్రజల దృష్టిలో ఇప్పుడు సీబీఐ అంటే 'ఛీ' బీఐ అనే నానుడి బలం పుంజుకుంటోందనడంలో సందేహం లేదు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశంలో సీబీఐ ఉనికే నిరర్థకం అనే పరిస్థితులు ఏర్పాడతాయన్నది విశ్లేషకుల భావన..!

# పెరిగిన గ్యాస్ ధరలపై..సీపీఐ నిరసన

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం దారుణమంటూ నెల్లూరులో సీపీఐ (భారత కమ్యూనిస్టుపార్టీ) నెల్లూరు రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న ఆమంచర్ల వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. యుద్ధం ప్రారంభమైన మరుసటిరోజు నుంచే కేంద్రం గ్యాస్ ధరలను గణనీయంగా పెంచేసిందని వారు ఆందోళన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకర్‌కిషోర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడమే కాక, పేదలకు మరింత భారంగా ఉండేలా చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. సీపీఐ నాయకులు



లీలామోహన్, ఆదినారాయణ, పముజుల హరి, రాంబాబు తదితరులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

## అవినీతి.. అక్రమాల..

# సిటీ 'ప్లానింగ్'.. గుట్టు రట్టు!

- పలువురు అధికారులకి ప్రభుత్వం నుంచి తాఖీదులు
- ఏసీబీ తనిఖీలతో 'నుడా' గడగడ!

**గత వైసీపీ పాలనలో అనేక శాఖలు అక్రమాలకు పుట్టిళ్లుగా మారాయి. అందులోనూ, నెల్లూరు నగరపాలక సంస్థ 'సిటీ ప్లానింగ్' విభాగమంటే అదో పెద్ద అక్రమాల పుట్టగా, అవినీతి కూపంగా మార్చిపారేశారు. అందినకాడకి దోచుకునే మాయగాళ్ళకి ఆ విభాగం పెట్టింది పేరన్నట్లుగా తయారుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూపీ లాగడంతో, ఇప్పుడు అందులోని అవినీతి అక్రమాల గుట్టంతా రట్టయిపోతోంది. తాజాగా ఉన్నత స్థాయి అధికారులు రంగంలోకి దిగి, ప్లానింగ్ విభాగంలో నాడు చక్రం తిప్పిన పలువురు అక్రమార్కులను గుర్తించి చర్యలు చేపట్టనుండడంతో, ఇంతకాలం జనం సొత్తు అప్పనంగా దిగమింగినవారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.**

నెల్లూరు రూరల్‌లోని అల్లీపురం వద్ద ఓ నిషేధిత లేఅవుట్‌లో భవన నిర్మాణాలకు తెరతీసిన అధికారులని ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అప్పట్లో అక్రమ లేఅవుట్లలో భవన నిర్మాణాలకి అనుమతులిచ్చేసిన అధికారులెవరన్నది క్షేత్రస్థాయిలో ఆరా తీసినట్లుంది. లేఅవుట్ల యజమానులతో అధికారులు కుమ్మక్కై అక్రమ పద్ధతుల్లో నిర్మాణాలకు అనుమతులు మంజూరుచేశారని నిర్ధారించుకుని, అందుకు బాధ్యులైన అధికారులకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి తాఖీదులు కూడా పంపినట్లు సమాచారం. ఆ తాఖీదులకు పదిహేనురోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తే సరి..లేదంటే చర్యలు తప్పవంటున్నారు మరి!..చూద్దాం ఏమవుతుందో!..అప్పట్లో దర్జాగా జరిగిన అక్రమాల బండబారాలు..ఇంకెన్ని బయటపడతాయో!..

నెల్లూరు నగరపాలకసంస్థ, నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ (నుడా)లలోని పట్టణ ప్రణాళిక విభాగాల్లో పేరుకుపోయిన అవినీతి అక్రమాలను బయటపెట్టేందుకు ఏసీబీ అధికారులు మంగళ, బుధవారాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఏసీబీ డీఎస్పీ రామకృష్ణుడు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి వరకు ఈ తనిఖీలు జరిగాయి. రికార్డులను లోతుగా పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయా విభాగాలవారు ఎందుకు అనుమతులిచ్చారో క్షేత్రస్థాయిలోనూ ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విభాగాల్లో ఎంతెంత అక్రమలు జరిగాయో మరింత సమగ్రంగా విచారణ చేసి త్వరలోనే ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో నుడా పట్టణ ప్రణాళికా విభాగంలోని అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.

# మన సంస్కృతికి ప్రతీక..ఉగాది

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

ఉగాది అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, ఆ పండుగ మన సంప్రదాయాల సుగంధాన్ని, మన సంస్కృతికి ఉన్న గొప్పతనాన్ని ప్రతిబింబించే పవిత్రమైన వేడుక అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. ఈనెల 19వ తేది ఉగాది పర్వదినం సందర్భంగా, నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో తెలుగుదనం ఉట్టిపడేలా జరిగిన ఉగాది సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఉగాది అంటే కొత్త ప్రారంభాలకు సంకేతమని, పంచాంగ శ్రవణం భవిష్యత్తుపై ఆశలను నింపుతుందని, ఉగాది పచ్చడి మనకు సమతుల్య జీవన విధానాన్ని నేర్పుతుందని కలెక్టర్ చెప్పారు. తొలుత ఈ వేడుకలకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నిర్వహించిన కవిసమ్మేళనం, ఎస్పీ బాలసుబ్రమణ్యం సంగీత కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ పంచాంగ శ్రవణకర్త ఆలూరి శిరోమణి శర్మ పరాభవ ఉగాది నామ సంవత్సర పంచాంగాన్ని వినిపించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితులను కలెక్టర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కవులను, కళాకారులను, వివిధ రంగాల ప్రముఖులను సన్మానించారు. జిల్లా పర్యాటకశాఖ అధికారిణి ఉషశ్రీ, ఆర్డీవో అనూష, మెప్మా పీడీ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.



కవులను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

# యువత రాజకీయాల్లో రాణించాలి

టిడ్కో ఛైర్మెన్ అజయ్

యువత రాజకీయాల్లో ప్రవేశించి రాణించాలని టిడ్కో ఛైర్మెన్, జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ ఆకాంక్షించారు. ఈనెల 18న సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మన్నారుపోలూరు గ్రామంలోని టిడ్కో గృహాల వద్ద ఏర్పాటుచేసిన జనసేన "ఉద్యమి నమోదు" కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఒక్కరిని జనసేన ఉద్యమి సభ్యులుగా నమోదు చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉద్యమి సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలను నాయకత్వ స్థాయికి తీసుకువచ్చే రాజకీయ సంస్కృతి జనసేనలోనే ఉందని తెలిపారు. టిడ్కో హౌసింగ్ ప్రాజెక్టులను గత వైఎస్సార్ ప్రభుత్వం నిలిపివేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల గృహనిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. జనసేన నాయకులు సుంకు సురేష్, మహబూబ్ బాషా, ఆవుల నాగేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో జనసేన నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



'ఉద్యమి' సభ్యత్వాలను నమోదు చేస్తున్న అజయ్‌కుమార్


నిత్య కృషీవలుడికి.. అభినందన శుభాకాంక్షలు



అకుంఠిత దీక్షతో, అలుపెరుగని పట్టుదలతో శ్రమిస్తూ
వ్యాపార, పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా రాణిస్తూ
ఆధ్యాత్మిక తత్పరతతో, అపార దాతృత్వంతో తరిస్తూ
చారిత్రాత్మక సినిమాల నిర్మాతగా ప్రేక్షకులని మెప్పిస్తూ
పెద్దలని, ఆత్మబంధువులని దైవ సమానులుగా కొలుస్తూ
హితులని, సన్నిహితులని, స్నేహితులని నిత్యం కలుస్తూ
తన జీవన ప్రస్థానంలో అగ్రగామిగా నిలుస్తున్న ... మా

**ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి గారు**

'తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్' వారిచే
అత్యంత ప్రతిష్టాత్మక **'గౌరవ డాక్టరేట్'**
అందుకున్న ఆనంద తరుణంలో
**మా అభినందన శుభాకాంక్షలు.**



ఆనం మహేష్‌రెడ్డి - ఆనం రాజి
ఆనం సంజితారెడ్డి, ఆనం శశాంక్‌రెడ్డి
నెల్లూరు.

లాయర్
మార్చి 20, 2026

# అవగాహన లోపం..'క్షయ' బాధితులకు శాపం!

ప్రపంచాన్ని భయపెడుతున్న అనేక ప్రాణాంతక వ్యాధుల్లో టీబీ (క్షయ వ్యాధి-ట్యుబర్కులోసిస్) వ్యాధి ఒకటి. మనదేశంలోనే కాదు, చాలా దేశాల్లో ఈ వ్యాధి విజృంభిస్తూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మందిని బలితీసుకుంటూనే ఉంది. వైద్యశాస్త్రం బాగా విస్తరించిన నేటి అధునాతన కాలంలోనూ టీబీ తన ప్రతాపం చూపుతూనే ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా అనుసరిస్తున్న వైద్యవిధానాల వల్ల మనదేశంలో క్షయవ్యాధితో మరణించేవారి సంఖ్య బాగా తగ్గుతూనే ఉన్నా, నేటికీ బాధితులు, మృతుల సంఖ్య ఇంకా భారీగానే ఉంటోంది. 2023లో సుమారు 32 లక్షల మంది వరకు ఈ వ్యాధితో మరణిస్తే, 2024లో కనీసం 12 లక్షల మందికిపైగానే చనిపోయారని గణాంకాలు చెప్తున్నాయి. ప్రపంచ ఆరోగ్యసంస్థ అంచనాల ప్రకారం మనదేశంలో టీబీ వ్యాధి ఎక్కువగానే ఉంది. ప్రపంచంలోని టీబీ కేసుల్లో సుమారు 26 శాతం దాకా ఒక్క మనదేశంలోనే ఉంటున్నాయని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి కూడా. అందుకే ఈ వ్యాధి మనదేశానికి ఒక పెద్ద సవాలుగానే ఉంటోంది. క్షయ వ్యాధి నివారణ కోసం కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పెద్దఎత్తున పోరాడుతూనే ఉన్నాయి. ఎన్నో రకాల ఆధునిక చికిత్సలను అమలులోకి తెచ్చి, వ్యాధి నిర్ధారణ-నివారణలకు శాయసక్తులా ప్రయత్నిస్తూనే ఉండడంతో, 2015 నాటికి ఇప్పటికీ పోలిస్తే 21 శాతం దాకా ఈ కేసులు తగ్గాయి. అయితే, వ్యాధి వచ్చినా నిర్లక్ష్యంగానే ఉండడం, వ్యాధి పట్ల అవగాహన లేకపోవడం వల్ల క్షయవ్యాధిగ్రస్తులు నానా యాతనలు పడుతూనే ఉన్నారు. బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌ల వల్ల ఈ వ్యాధి వస్తుంది, ఎక్కువగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారిని ఈ వ్యాధి పట్టి పీడిస్తుంటుంది. కనుక, చిన్నపిల్లలు-వృద్ధులు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి. పోషకాహార లోపంతో ఈ వ్యాధికి గురయ్యేవారి సంఖ్య కూడా మనదేశంలో ఎక్కువగానే ఉంటోంది. ఈ వ్యాధి ఇతరత్రా అవయవాల మీద కూడా ప్రభావం చూపుతుంది కనుక, దాన్నొక కంట కనిపెట్టి ఉండాలి. వ్యాధి నివారణకు ముందుగా వ్యాధిపట్ల అవగాహన కలిగించుకోవాలి. టీబీ వచ్చి ఉంటుందని అనుమానం వచ్చినా చాలు, వెంటనే వైద్యులను సంప్రదించాలి. రాత్రీ పగలూ తగ్గని దగ్గు, రెండు మూడు నెలల పాటు దగ్గు తగ్గకపోవడం, ఒక్కోసారి నోటినుంచి రక్తం పడడం, బాగా జ్వరం రావడం, రాత్రివేళల్లో చమటలు పడుతుండడం, ఆకలి లేనట్లనిపించడం, ఛాతీలో నొప్పి రావడం వంటివి ఈ వ్యాధి ప్రాథమిక లక్షణాలని వైద్యులు చెప్తున్నారు. 'మైక్రో బ్యాక్టీరియా ట్యుబర్క్యులోసిస్' అనే సూక్ష్మజీవి (బ్యాక్టీరియా) ద్వారా ఈ వ్యాధి వస్తుంటుంది. క్షయవ్యాధి గ్రస్తులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఆ తుంపర్ల ద్వారా వచ్చే బ్యాక్టీరియా ఆ పరిసరాలంతటా వ్యాపిస్తుంటుంది. ఇతరులకు కూడా ఈ వ్యాధి సోకుతుంటుంది. ముఖ్యంగా ధూమపానం, పొగాకు వినియోగం, మద్యపానం, మాదక ద్రవ్యాలు ఉపయోగించడం వంటివి ఈ వ్యాధి వచ్చేందుకు ప్రధాన కారకాలుగా ఉంటాయి. వీటివల్ల చేజేతులా మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. కనుక, ఆ దురలవాట్లన్నిటికీ ప్రజలు దూరంగా ఉండాలి. ధూమపానం చేసేవారికి ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఎంతైనా ఉంది కనుక, పొగ తాగడం మానేయాలి. క్షయవ్యాధి ప్రమాదకరమే అయినా, దాన్ని నయం చేసుకునే మార్గాలన్నీ మనచేతుల్లోనే ఉన్నాయి. వ్యాధిని గుర్తించాక వెంటనే తగు చికిత్సలు చేయించుకోవడం, మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రించుకోవచ్చని వైద్యవర్గాలు భరోసా ఇస్తున్నాయి.

మందులు సక్రమంగా వాడితే ఈ వ్యాధి నయమవుతుంది. ఆరునెలల్లోనే పూర్తిగా తగ్గిపోతుంది కూడా. అలాకాక మనదేశంలో చాలామంది ఓ రెండు నెలలు మందులు వాడి, కాస్త తగ్గడంతోనే మందులు వేసుకోవడం మానేయడం వల్ల ఆ వ్యాధి మళ్ళీ విజృంభిస్తుంది. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల కూడా ఈ వ్యాధి కేసులు, మరణాలు ఇంకా పెరుగుతున్నాయి. ఇకనైనా అలక్ష్యం వీడాలి. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వాలు రోగులకు అన్నివిధాలా బాసటగా ఉన్న నేటి పరిస్థితుల్లో, క్షయ వ్యాధి నివారణకి ఆధునిక వైద్యచికిత్సలు అందుబాటులో ఉంటున్న నేటికాలంలో క్షయని చూసి బెంబేలెత్తాల్సిన పనే లేదు. ఇది ప్రమాదకర వ్యాధే అయినా.. అవగాహనతో ముందుగా గుర్తిస్తే సులభంగానే నివారించవచ్చు కనుక, ఆ దిశగా వ్యాధి నివారణకు ఎవరికి వారు కృషిచేస్తే.. టీబీ ఇక మన దగ్గరికి రానే రాదు. వచ్చినా భయపడాల్సిన అవసరమే లేదు!...

(మార్చి 24-ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం)

# ఈ సమయంలో రాజకీయ విమర్శలు అర్థరహితం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ప్రపంచం మొత్తం సంక్షోభంలో ఉన్న తరుణంలో కూడా భారతదేశం తన ఎనర్జీ సెక్యూరిటీని కాపాడుకోగలగడం నిజంగా గొప్ప భౌగోళిక రాజకీయ విజయంగా చూడొచ్చు. భారత్‌కు వచ్చే ఆయిల్ నౌకలను అడ్డుకోబోమని ఇరాన్ స్పష్టంగా చెప్పింది. అవసరమైతే భారత్‌కు ఆయిల్ షిప్‌లను డైవర్ట్ చేస్తామని రష్యా స్పష్టం చేసింది. భారత్ రష్యా నుండి ఆయిల్ కొనడంపై తమకెలాంటి అభ్యంతరంలేదని అమెరికా ప్రకటించింది. ప్రపంచంలోని మూడు వేర్వేరు బ్లాక్స్ అమెరికా, రష్యా, ఇరాన్. ఈ మూడు దేశాలూ భారత్ ఎనర్జీ అవసరాలను అర్థం చేసుకుని సహకరిస్తున్నామంటున్నాయి. ఇది సాధారణ విషయం కాదు. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అంటే ఏమిటో ప్రపంచానికి ఒక ఉదాహరణగా ఈ విషయాన్ని పేర్కొనవచ్చు. ఒకవైపు యుద్ధం, మరోవైపు సుంకాలు, ఇంకోవైపు ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ సంక్షోభం. అయినా కూడా ఎక్కడా ఆటంకం లేకుండా భారత్‌కు ఆయిల్ సరఫరా కొనసాగుతుందంటే దౌత్యపరంగా భారత్ స్థానం ఎంత బలంగా ఉందో మనం ఊహించుకోవచ్చు. ఇవన్నీ గమనించకుండా, కొంతమంది స్వార్థపరులు రాజకీయ ప్రాబల్యం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పార్టీలు, రాజకీయాలు పక్కనపెట్టి సమాజ సంక్షేమం కోసం, దేశ ప్రయోజనం కోసం మన నేతలు ఆలోచిస్తే బాగుంటుంది.

యం. చంద్రమౌళి - కొత్త ఢిల్లీ.

## నిజమే.. సజ్జల వలన వైసీపీకి నష్టమే!

వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఒకప్పటి సలహాదారు, ప్రస్తుత సమన్వయకర్త, సజ్జల రామకృష్ణారెడ్డి కారణంగా జగన్ పార్టీకి జరుగుతున్న నష్టం గురించి గత వారం మన 'లాయర్'లో వచ్చిన అంశాలు నూటికి నూరు శాతం నిజాలు. దాదాపు అన్ని వర్గాలలో జగన్ గారి మీద నెగటివ్ అభిప్రాయం కలగడానికి సజ్జలే కారణం. ఆయన పార్టీ కార్యకలాపాలకు దూరంగానైనా ఉండాలి, లేదా పార్టీ శ్రేణులకు బహిరంగంగా కనిపించడం మానేయాలి. ఇది నేను స్థాపించిన పార్టీ నా ఇష్టం అనుకుంటే పార్టీని ఆ దేవుడే కాపాడాలి. పార్టీ అన్నది ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ కాదు కదా. కొన్ని లక్షలమంది జీవితాలు పార్టీ పైన ఆధారపడి వున్నాయన్న విషయాన్ని పార్టీ అధ్యక్షుడు గుర్తుపెట్టుకోవాలి. పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు, ప్రజలయొక్క మనోభావాలని, అభిప్రాయాలని దృష్టిలోపెట్టుకుని పార్టీని నడపాలి.

- రాళ్ళపల్లి రాజర్షి, తిరుమల.

## అన్ని అంశాలు బాగుంటున్నాయి!

మన 'లాయర్'లో ప్రతి వారం మీరు స్పృశిస్తున్న అన్ని అంశాలు బాగుంటున్నాయి. గత రెండువారాల సంచికలలో వచ్చిన వార్తలని ఓసారి పరిశీలిస్తే... రాజకీయాల్లో సత్యశోధన ప్రక్కనపెట్టి సత్యదూషణకే ప్రాధాన్యత సంతరించుకోవడం బాధాకరం. సత్యానికి ఇది గ్రహణకాలం. ఇక జెన్-జడ్ నాయకత్వం ద్వారా హిమాలయ (నేపాల్) రాజ్యం ఏ దిశలో పయనిస్తుందో వేచిచూడాలి. తరచూ కొన్ని వేలమంది ప్రయాణికులకు ఆధారంగా వున్న నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ సత్వరం పూర్తి కావాలి. ఆ దిశగా మన నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

సీ. ఆర్. విశ్వేశ్వరరావు
మాజీ ఉపకులపతి, హైదరాబాదు.

# ప్రమోదం కాదు.. ప్రమాదం!

మనసులో మాట 89

యుద్ధం గురించి వినడానికి ఆసక్తికరంగా ఉండొచ్చు. టీవీ తెరలపై కనిపించే బాంబుల పేలుళ్లు, నింగిలోకి దూసుకుపోయే ఫైటర్ జెట్లు, క్షిపణులను ప్రయోగించే యుద్ధనౌకల విన్యాసాలు కనుల విందుగా అనిపించవచ్చు. కానీ, ఆ రణగొణ ధ్వనుల వెనుక సామాన్యుడి నిశ్శబ్ద రోదనలు ఉంటాయి. యుద్ధం నేరుగా సృష్టించే మరణాలు, గాయాల సంగతి పక్కనబెడితే, యుద్ధంతో ఏ మాత్రం సంబంధం లేని సామాన్యుల జీవితాల్లో అది మిగిల్చే కష్టనష్టాలు అపారం. యుద్ధం నేరుగా ప్రాణాలను తీయడమే కాదు, బతికున్న వారిని ఆర్థికంగా కుంగదీస్తుంది. నేడు అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచం మరోసారి గడగడలాడుతోంది. ఎక్కడో గల్ఫ్ తీరంలో పేలే బాంబు, వివిధ దేశాల్లో ఇంధన సంక్షోభాన్ని సృష్టిస్తోంది.

### అనుసంధానిత ప్రపంచంలో అల్లకల్లోలం

నేటి ఆధునిక ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్. ఏ దేశానికి ఆ దేశం పూర్తి స్వయం సమృద్ధం కాదు. ప్రతి వస్తువు తయారీ వెనుక పదుల సంఖ్యలో దేశాల భాగస్వామ్యం ఉంటుంది. యుద్ధం ప్రారంభం కాగానే రవాణా మార్గాలు మూతపడతాయి. ముఖ్యంగా ఇంధన ఎగుమతులకు కేంద్రమైన మధ్య ప్రాచ్య దేశాల్లో యుద్ధం వస్తే, చమురు సరఫరా వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతుంది. ముడిచమురు ధర పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతాయి. ఒక దేశంలో ఏసీలు వేయొద్దని, మరో దేశంలో నాలుగు రోజులే పనిదినాలని, ఇలా వివిధ దేశాల్లో ప్రభుత్వాలు ఆంక్షలు విధిస్తున్నాయంటే యుద్ధం తాలూకూ చేదు ఫలితాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కరోనా కల్లోలం తర్వాత మళ్లీ ఇప్పుడిప్పుడే కార్యాలయాలకు పూర్తిస్థాయిలో రావాలని చెబుతున్న బహుళ జాతి సంస్థలు యుద్ధం నేపథ్యంలో తిరిగి వర్క్ ఫ్రం హోం అంటున్నాయి. కొన్ని సంస్థలు కార్యాలయాల్లో ఫుడ్ కోర్టులు మూసివేస్తున్నాయి. మన దేశంలోనే చూసుకుంటే, గతంలో 15 రోజుల్లో వచ్చే వంట గ్యాస్ సిలిండర్ కోసం ఇప్పుడు పట్టణాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి వస్తోందని చమురు సంస్థలే చెబుతున్నాయి. ఈ పరిణామాలను బట్టే యుద్ధం మొదలయిన పది రోజుల్లోనే ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే పర్యవసానాలు ఊహకు అందనివి. ప్రపంచ ముడిచమురు రవాణాలో ఐదోవంతు (20%) సాగే 'హోర్ముజ్ జలసంధి' మూతపడితే, ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. నిపుణుల అంచనా ప్రకారం, యుద్ధం సంభవిస్తే సామాన్యుడి కొనుగోలు శక్తి కనీసం 30% పడిపోతుంది. యుద్ధ అనిశ్చితి నెలకొన్నప్పుడు బహుళ జాతీయ సంస్థలు కొత్త ప్రాజెక్టులను నిలిపివేస్తాయి. ఫలితంగా ఉద్యోగాల్లో కోత ఉంటుంది. ఇప్పటికే ఏఐ విప్లవంతో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న లేఆఫ్‌లు ఆందోళన కలిగిస్తున్నాయి.

### చరిత్ర నుంచి నేర్వని పాఠాలు

మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక జర్మనీలో 'హైపర్ ఇన్ఫ్లేషన్' ఎంతలా ఉందంటే, కేవలం రొట్టె ముక్క కోసం సంచులతో డబ్బులు తీసుకెళ్లాల్సి వచ్చింది. 1922లో ఒక కిలో మాంసం ధర కొన్ని మార్కులు (అప్పట్లో జర్మన్ కరెన్సీ) ఉంటే, 1923 చివరి నాటికి అది కొన్ని కోట్ల మార్కులకు చేరుకుంది. యుద్ధానికి ముందు ఒక జీవితకాలం కష్టపడి దాచుకున్న లక్ష మార్కులు, ఒక చిన్న మిఠాయి కొనడానికి కూడా సరిపోని పరిస్థితి ఏర్పడింది. అంటే జీవితాంతం దాచుకున్న డబ్బు ఒక్క రాత్రిలో దాని విలువను కోల్పోయి కాగితం ముక్కలతో సమానమైంది. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జర్మనీపై 'వెర్సయిల్స్ ఒడంబడిక' ద్వారా భారీ జరిమానాలు విధించారు. జరిమానాలు చెల్లించడానికి, సమ్మెలో ఉన్న కార్మికులకు జీతాలు ఇవ్వడానికి జర్మనీ ప్రభుత్వం విపరీతంగా కరెన్సీ నోట్లను ముద్రించింది. వస్తువుల ఉత్పత్తి పెరగకుండా కేవలం డబ్బు ముద్రణ పెరగడం వల్ల ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. ఐదేళ్ల పాటు సాగిన రెండో ప్రపంచ యుద్ధం ఐరోపాలో పారిశ్రామిక ఉత్పత్తిని 50%కు తగ్గించివేసింది. కోట్ల మంది ఉపాధి కోల్పోయి, దశాబ్దాల పాటు దారిద్ర్యంలో మగ్గిపోయారు. ఇది అంతర్జాతీయ వాణిజ్యాన్ని స్తంభింపచేసింది. యుద్ధం ముగిశాక బ్రిటన్ లాంటి అగ్రరాజ్యాలే రేషనింగ్ వ్యవస్థపై ఆధారపడాల్సి వచ్చింది. ఉపాధి పోవడం వల్ల తలెత్తిన ఆర్థిక మాంద్యం నుంచి కోలుకోవడానికి ప్రపంచ దేశాలకు దాదాపు రెండు దశాబ్దాల కాలం పట్టింది. యుద్ధంలో కుప్పకూలే భౌతిక నిర్మాణాల పునరుద్ధరణకు ఐదేళ్లు పడితే, కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి కనీసం రెండు దశాబ్దాల సమయం పడుతుందని ఆర్థికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. యుద్ధం అనేది కేవలం బాంబుల పేలుళ్లు, దూసుకుపోయే తూటాలు మాత్రమే కాదు, అది ఒక తరం కలలను నాశనం చేయడం. యుద్ధం అనేది రాజకీయ నాయకుల నిర్ణయం కావచ్చు, కానీ దాని మూల్యం చెల్లించేది మాత్రం సామాన్యుడే. బాంబుల వెలుగులు సామాన్యుడి ఇంట్లో చీకట్లను నింపుతాయి. దేశాల మధ్య ఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల కుటుంబాల ఉపాధిని ప్రభావితం చేస్తాయి. అందుకే యుద్ధం అనేది చివరి ప్రత్యామ్నాయం కూడా కాకూడదు. చర్చలు, దౌత్యనీతి ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే మానవాళికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు శ్రేయస్కరం. ఎందుకంటే యుద్ధంలో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా చివరకు నష్టపోయేది మాత్రం సామాన్య ప్రజలే. యుద్ధం గురించి వినే 'వీరత్వం' పుస్తకాల్లోనే బాగుంటుంది, కానీ వాస్తవ జీవితంలో అది కన్నీటిని, ఆకలిని, దారిద్ర్యాన్ని మాత్రమే మిగిలిస్తుంది. ప్రపంచ శాంతి అనేది కేవలం ఒక నినాదం మాత్రమే కాకూడదు. అది ప్రతి సామాన్యుడి మనుగడకు అత్యవసరమైన అవసరం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

## ○ 'చిన్ని' కవికి.. గొప్ప సత్కారం!

# నారాయణరావుకు 'కళారత్న' పురస్కారం



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా 'కళారత్న' హంస అవార్డునందుకుంటున్న చిన్ని నారాయణరావు, పక్కన మంత్రి ఆనం

నెల్లూరుకు చెందిన సీనియర్ సాహితీవేత్త ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రతిష్టాత్మక 'కళారత్న' రాష్ట్ర ప్రభుత్వ 'హంస' పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారం కింద 50వేల రూపాయలతో పాటు శాలువా, జ్ఞాపికలతో ఆయనని సన్మానించారు. నెల్లూరు సాహితీరంగాన్ని అనుదినం అక్షరోత్సవాలతో పులకింపజేస్తున్న కవి చిన్ని నారాయణరావు అన్న విషయం అందరికీ తెలిసిందే. తాను స్వీయ కవితా ఖండికలు వెలువరించడమే కాక, సాహితీ కార్యక్రమాలను కూడా దిగ్విజయంగా నిర్వహించడం ఆయన ప్రత్యేకత. నెల్లూరు పురమందిరంలో ఆయన నిర్వహించిన సాహిత్యసభలకు లెక్కే లేదు. సాహితీసభలకి ఆయనో సారధిగా, కవులకు – సమాజానికీ మధ్య వారధిగా ఉంటూ, నిరుపమానమైన తన కవితా ప్రతిభతో సమాజానికి నిత్యచైతన్య రేఖగా ఉంటూ, రాష్ట్రవ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంటున్నారాయన.

### 'చిన్ని' రచనలు.. చైతన్య దీపికలు :

చిన్ని నారాయణరావు 1958లో స్వర్గీయ చిన్ని రామలక్ష్మమ్మ-యానాదిశెట్టి దంపతులకు జన్మించారు. ఎం.కాం, బీఎల్ చదివి నెల్లూరులో టాక్స్‌ప్రాక్టీషనర్‌గా పనిచేస్తున్నారు. వృత్తి ఆడిటర్ అయినా, చిన్నతనం నుంచి కవితా ప్రవృత్తే ఆయన చిత్తవృత్తి. ఆయన రచించిన కవితా సంపుటులెన్నో సమాజానికి చైతన్యదీపికలయ్యాయి. ఆయన కలం నుంచి జాలువారిన 'జీవితం ఓ విజయం', అంతర్ముఖం కవితామాలికలు, 'గుండెదీపం', 'గంపకూడు', 'బతుకొక ఉత్సవం', 'వెలుగుపూల వసంతం' అనే కవితా సంపుటాలు ఆయన రచనా వైదుష్యానికి నిదర్శనాలు. ప్రత్యేకించి ఆయన రచించిన 'మాట' దీర్ఘకవిత మరో సంచలనం. రాష్ట్రవ్యాప్తంగానే కాక, జాతీయస్థాయిలో కూడా పేరొందిన దీర్ఘకవిత అది. నాటి భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా 2017లో ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఆవిష్కృతమైన 'ది వర్డ్' ఆంగ్లానువాదానికి ఈ 'మాట' దీర్ఘకవితే మూలాధారం. ఆ తర్వాత రచించిన 'దాహం-దాహం' దీర్ఘకవిత కూడా ఆయనకెంతో పేరు తెచ్చింది. నేటికీ ఏ ఒక్కరోజు కూడా విశ్రమించకుండా కవితా సేద్యంలో నిరంతరం శ్రమిస్తూ తరిస్తూనే ఉన్న నారాయణరావు 'కళారత్న' అవార్డునందుకోవడం పట్ల సాహితీరంగంలో సంతోషం వ్యక్తమవుతోంది.

### కలెక్టర్‌చే.. పొట్టి శ్రీరాములు పాటల సీడీ ఆవిష్కరణ



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జీవితం, త్యాగాన్ని స్మరించుకుంటూ నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, రచయిత చిన్ని నారాయణరావు రచించిన పాటల సీడీని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 14న నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్, ఆడిటర్ చిన్ని శ్రావణ్‌కుమార్, అతిథి హోటల్ అధినేత సురేష్ కుమార్, చిన్ని రామ్ శ్రీకేతన్ తదితరులు పాల్గొన్నారు.








# ఆయన ఇక.. డాక్టర్ మహేష్

## ● గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆల్తూరు మహేష్‌రెడ్డి



డాక్టరేట్‌ను అందుకుంటున్న ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి

నెల్లూరీయులకి చిరపరిచితులు, వ్యాపార సామ్రాజ్యంలో అగ్రగామిగా రాణిస్తున్న ఏ.యం.ఆర్ సంస్థ వ్యవస్థాపకులు, ఆ సంస్థ ప్రస్తుత ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి ఇకపై డాక్టర్ మహేష్‌రెడ్డి. మహారాష్ట్ర, పుణెలో 102 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన దిగ్గజ విద్యాసంస్థ 'తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్' మార్చి 14వతేదీ శనివారం నాడు మహేష్‌రెడ్డిని గౌరవ డాక్టరేట్ పురస్కారంతో సత్కరించింది. వ్యాపార, పారిశ్రామిక, సినీ, ఆధ్యాత్మిక, సేవా రంగాలలో మహేష్‌రెడ్డి చేస్తున్న కృషికి సత్కారంగా ఈ గౌరవ పురస్కారం ఆయనని వరించింది.

### విద్యార్థి దశ నుండే వ్యాపారం వైపు...!

మహేష్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఓవైపు చదువుకుంటూ మరోవైపు తమ తండ్రి స్థాపించిన కాంట్రాక్టు రంగంలో కాలు మోపారు. చిన్నప్పటినుండే కష్టపడడం నేర్చుకున్నారు. నిత్యం నాన్నకి సహకరిస్తూనే అదే తరుణంలో వ్యాపార రంగంలో మెళకువలు నేర్చుకున్నారు. 1988లో డిగ్రీ అందుకున్న అనంతరం కూడా నాలుగేళ్లపాటు తమ తండ్రి సంస్థలోనే పనిచేసి, అనంతర 1992లో తన సొంత పేరు మీద ఏ.యం.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అనే నిర్మాణ సంస్థని ప్రారంభించారు. ఈ సంస్థలో తన నాన్న ఆల్తూరు ఆదినారాయణ రెడ్డి, అన్న గిరిధర్‌రెడ్డిలని కూడా భాగస్వామ్యులుగా చేర్చారు. ఇక అక్కడనుండి మహేష్‌రెడ్డి వెనక్కి తిరిగి చూడలేదు. ఎంతటి వారికైనా వ్యాపార రంగంలో అతి సహజంగా ఏర్పడే చిన్నచిన్న కుదుపులని సైతం తట్టుకుని తన సంస్థని అగ్రగామి సంస్థగా నిలబెట్టారు. అనేక విదేశీ సంస్థలు సైతం మహేష్‌రెడ్డి సంస్థలో పెట్టుబడులు పెట్టడానికి పోటీపడేలా సంస్థని తీర్చిదిద్దారు. ఒక్క భారతదేశంలోనే కాకుండా విదేశాలలో సైతం తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహించేలా మైనింగ్ రంగంలో కాలుమోపారు మహేష్‌రెడ్డి. జాతీయ అంతర్జాతీయ సంస్థలతో పోటీపడుతూ సంస్థ పురోగతి కోసం పగలు రాత్రీ అన్న తేడా లేకుండా కష్టపడ్డారు. ఓ వైపు లైమ్‌స్టోన్ మైనింగ్ సాగిస్తు.. మరోవైపు ఐరన్ ఓర్‌పై దృష్టిపెట్టారు. అనంతరం తన చూపుని కోల్ మైనింగ్ వైపుకిమరల్చి, 2004-2005 నాటికల్లా కోల్ మైనింగ్‌లో ప్రఖ్యాతి గాంచిన తొలి 3 సంస్థలలో ఏయంఆర్‌కి స్థానం దక్కేలా చేశారు.

### ఏ.యం.ఆర్ ఇండియా లిమిటెడ్‌గా పేరు మార్పు

ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన తమ ఏ.యం.ఆర్. కన్‌స్ట్రక్షన్స్‌కి "ఏ.యం.ఆర్ ఇండియా లిమిటెడ్"గా పేరు మార్చారు. ప్రపంచంలో ఎక్కడ తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహించినా ఇది భారతీయుల సంస్థ అని తమ సంస్థకి గుర్తింపువచ్చేలా సంస్థకి నామకరణం చేశారు. క్రమేణా తమ సంస్థలో పెట్టుబడి పెట్టిన వారివాటాలని తిరిగి తానే కొనుగోలు చేసే స్థాయికి ఎదిగారు. మైనింగ్‌తో పాటు రోడ్లు, భవనాలు పారిశ్రామిక మౌలిక వసతులు, రిజర్వాయర్‌లు, డ్యాంలు వంటివి నిర్మించడంతో నిర్మాణరంగంలో కూడా తన ప్రతిభని చూపించారు, ఇప్పటికీ చూపిస్తున్నారు కూడా.

### ఆధ్యాత్మిక సేవాతత్పరత...!

ఆల్తూరు కుటుంబం మొత్తం ఆధ్యాత్మిక సేవాతత్పరులు. తమ తల్లిదండ్రులు స్వర్గీయ ఆదినారాయణరెడ్డి – శ్రీమతి సులోచనమ్మల దగ్గర నుండి, మంచితనం, వినయం, విధేయతలతో పాటు దైవభక్తిని కూడా వారసత్వంగా తీసుకున్నారు మహేష్‌రెడ్డి. నెల్లూరుజిల్లాలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మహేష్‌రెడ్డి సారథ్యం వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తిలతో పాటు నెల్లూరు రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలోనూ, శివాలయంలోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలని తమ కుటుంబ ఆధ్వర్వంలో చేపట్టారు. 2007లో తమ కుటుంబం తరఫున 140కిలోల బంగారాన్ని షిరిడి సాయిబాబాకి కానుకగా అందించి బాబా పట్ల తమకున్న భక్తి భావాన్ని చాటుకున్నారు.

### సినీరంగంలో సైతం గుర్తింపు...!

బాబా లీలలను, ఆయన మహిమలను తద్వారా ఆయన చరిత్రను ఈ తరం వారికి అందించాలన్నది మహేష్‌రెడ్డి తపన. అదే ఆలోచనతో యువసామ్రాట్ అక్కినేని నాగార్జున హీరోగా బాబా పాత్ర పోషించిన 'షిరిడి సాయి' సినిమాని తెరకెక్కించారు. ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు ఆ చిత్రానికి దర్శకత్వం వహించారు.

### హథీరామ్ బాబాజీ చరిత్ర ఆధారంగా 'ఓం నమో వేంకటేశాయ'...!

తిరుమల తిరుపతి దేవస్థానాల చరిత్రలో విశేష ప్రాధాన్యత కలిగిన హథీరామ్ బాబా గురించి కూడా చాలామందికి తెలియక పోవడాన్ని కూడా మహేష్‌రెడ్డి గుర్తించారు. ఉత్తరాది నుండి తిరుమలకు వచ్చి స్థిరపడి, సాక్షాత్తూ ఆ శ్రీ వేంకటేశ్వరునితో పాచికలాడిన మహాభక్తుడు హథీరామ్ బాబా. హథీరామ్ బైరాగిగా, హథీరామ్ బాబాజీగా కూడా ఆయన ప్రసిద్ధి 'ఓం నమో వేంకటేశాయ' పేరుతో మరో ఆధ్యాత్మిక చిత్రాన్ని నిర్మించి హథీరామ్ బాబాజీ జీవితకథను, ఆయనకున్న ప్రాధాన్యతను శ్రీవారి భక్తులకు తెలియజేశారు. ఈ సినిమాలో కూడా నాగార్జుననే హీరోగా ఎంపిక చేసి ఈ తరం యువతను మహేష్‌రెడ్డి. ఆకట్టుకున్నారు.

క్రమశిక్షణ, సమయ పాలన, అంకితభావం, పట్టుదల, అనుకున్నది సాధించాలన్న తపన ఇవన్నీ మహేష్‌రెడ్డిలో అణువణువూ జీర్ణించుకుపోయిన సద్గుణాలు. ఇక మానవ సంబంధాలలో ఆయనకి ఆయనే సాటి. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలన్న మాటకి అయన నిలువెత్తు సాక్ష్యం. "తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్" మహేష్‌రెడ్డిని బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తించింది. గౌరవ డాక్టరేట్‌తో ఆయనని సత్కరించింది.

### కన్నవారినీ.. జన్మభూమినీ మరువకండి..!

**- డాక్టర్ మహేష్‌రెడ్డి**

ఈ సందర్భంగా డాక్టర్ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఈ పురస్కారం స్వీకరించడం తన జీవితంలో అత్యంత సంతోషకరమైన సందర్భం అన్నారు. అక్కడి విద్యార్థినీవిద్యార్థులని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ అమ్మానాన్నలని గౌరవించాలన్నారు. వారి ఆశీస్సులు ఉంటే జీవితంలో అద్భుత విజయాలు సాధించవచ్చన్నారు. అలాగే మనకి పాఠాలు చెప్పిన గురువులని కూడా ఎన్నటికీ మరువకూడదన్నారు. మనం సాధించే ప్రతి విజయం వెనుక గురువుల కృషి ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. మనం ఏ రంగంలో రాణించినా ఏ ప్రాంతంలోవున్నా ముందుగా మనం జన్మించిన గ్రామాన్ని, ఆతరువాత జిల్లాని, రాష్ట్రాన్ని దేశాన్ని మర్చిపోకూడదన్నారు. ఈ పోటీ ప్రపంచంలో భారత దేశంలో కావలసినన్ని అవకాశాలు ఉన్నాయని, యువత ఇతర దేశాలకి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. తనకి గౌరవ డాక్టరేట్‌ని ఇచ్చి సమాజం పట్ల తన బాధ్యతని "తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్" యాజమాన్యం మరింత పెంచిందన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ మహేష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు...!

# చిరస్మరణీయులు.. శ్రీ పొట్టి శ్రీరాములు



శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆ మహనీయుని త్యాగాలు అపూర్వమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు సెంటర్‌లో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నెల్లూరుజిల్లాతో పొట్టి శ్రీరాములు బంధం విడదీయరానిదన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువలేరని అన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మద్రాసులో జన్మించి నప్పటికీ వారి కుటుంబ మూలాలు నెల్లూరుజిల్లా జువ్వలదిన్నె గ్రామంలో అనుబంధం కలిగి వున్నాయన్నారు. జువ్వలదిన్నె గ్రామాన్ని పొట్టి శ్రీరాములు మెమోరియల్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పొట్టిశ్రీరాములు త్యాగస్ఫూర్తి, నిబద్ధత నేటి తరాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, అర్బన్ తహశీల్దారు షఫీమాలిక్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 'ఫ్రెండ్స్ వాకర్స్' ఆధ్వర్యంలో..

# ఆరోగ్యంపై అవగాహన



వాకర్స్‌కి అవగాహన కలిగిస్తున్న డాక్టర్ జగదీష్ పావులూరు

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఫుట్‌కేర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ జగదీష్ పావులూరు (జనరల్ ల్యాప్రోస్కోపిక్ అండ్ బేరియాట్రిక్ సర్జన్) పాల్గొని, షుగర్‌పేషెంట్లకు కాళ్లకు వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాళ్ళ తిమ్మిర్లు, మొద్దుబారడం వంటివాటిని అశ్రద్ధ చేయకూడదని, వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. తొలుత, వాకర్స్‌కి న్యూరోపతి స్క్రీనింగ్ పరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్‌అహమ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, 203-వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, బిరుదవోలు రామ్మోహన్‌రెడ్డి, మాగుంటి ప్రసాద్‌నాయుడు, బెల్లం చెంచయ్యనాయుడు, బి.భాస్కర్‌నాయుడు, పి.సుబ్బారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, పత్తిపాటి రమణయ్య, ఎంఎస్ చౌదరి, కాగొల్లు శివయ్య, కె.వెంకటరమణ, సాయిసుబ్బారావు, జి.నారాయణరెడ్డి, కొండూరు సుబ్బారావు, పాల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# ముస్లిమ్ సోదరులకు 'రంజాన్ తోఫా'

### అందజేసిన ప్రశాంతిరెడ్డి



ముస్లిం సోదరులకి రంజాన్ తోఫా కిట్‌లను అందజేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల నెల్లూరులోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో, మసీదులలో పనిచేస్తున్న పలువురు ఇమామ్‌లు, మౌజమ్‌లు తదితరులకు రంజాన్ తోఫా కిట్‌లను అందజేశారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరునగర, రూరల్ నియోజక వర్గాల పరిధిలోని మసీదులలో పనిచేస్తున్న అనేకమంది ఈ పండుగ కానుకలను అందుకున్నారు.

### మసీదులకు వాటర్ కూలర్లు..

వేసవి కాలంలో మసీదులలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతు న్నామని ముస్లిం మతపెద్దలు చేసిన విన్నపానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇందుకూరుపేట మండలానికి చెందిన రాముడుపాళెం, మైపాడు, పాములవారి పాళెం, కొత్తూరు, పల్లిపాడు, నిడిముసలి మరియు దేవిస్‌పేట గ్రామాలకు చెందిన మసీదులకు వాటర్ కూలర్లను ఆమె అందజేశారు.

# 'హరివిల్లు' పురస్కారాలు



'హరివిల్లు' పురస్కారాన్నందుకుంటున్న ప్రముఖ సినీ నటుడు బాలాజీ

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని 'హరివిల్లు క్రియేషన్స్' వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ హాస్యనటుడు దోర్నాల హరిబాబు నేతృత్వంలో ఇటీవల స్థానిక టౌన్‌హాలులో వివిధరంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్నవారికి పురస్కారాలు అందజేశారు. ప్రముఖ సినీ నటుడు బాలాజీ, డాక్టర్ జయరామిరెడ్డిలకు విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. అదేవిధంగా, పచ్చా పెంచలయ్య, బత్తుల విజయకుమార్, పి.శ్రీనివాసులునాయుడు, కె.మనోజ్ఞ, పి.నరేంద్ర, వై.కృష్ణయ్య, బి.ఆంజనేయులు, బి.రమేష్ తదితరులకు ఉగాది పురస్కారాలందజేశారు. ముఖ్య అతిథులుగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, అమరావతి కృష్ణారెడ్డి, డా.కె.అగస్టస్‌బాబు, డా. నిశ్చల్‌ప్రసాద్‌రెడ్డి, డా.సివిఎస్ శ్రీనివాసరాజు, ప్రదీప్, రంగారావు, శ్రీనివాసులు, రామ సుబ్బారావు, బండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవికి పిఎస్ఆర్ వాకర్స్ నివాళి



నివాళులర్పిస్తున్న పిఎస్ఆర్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమరజీవి, త్యాగధనుడు శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకొని శ్రీ పొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్-నెల్లూరు వారు ఇటీవల ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 203-గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అధ్యక్షులు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, గౌరవాధ్యక్షులు పప్పు నారాయణ, సెక్రటరీ జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. జాయింట్ సెక్రెటరీ వి కేశవులు సౌజన్యంతో అందరికీ మజ్జిగ పంపిణీ చేశారు.

# డా.కిషోర్స్ రత్నంలో ఉగాది సంబరాలు




ఉగాది పచ్చడి విశిష్టతను తెలియజేస్తున్న డా. కిషోర్స్ రత్నం విద్యార్థినులు

ఉగాది పండుగను పురస్కరించుకుని నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం కిడ్స్, రేస్ ఇంటర్నేషనల్, టెక్నో, మెడికల్ ఒలంపియాడ్ స్కూళ్లలో విద్యార్థులు ఈనెల 18న ముందస్తు ఉగాది వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయబద్ధంగా గోపూజ చేసి వేడుకలు ప్రారంభించారు. విద్యార్థులు వేదపఠనం, కలశపూజ నిర్వహించారు. డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్., ఏఓ తుహీన, సునీల్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, జాస్మిన్, నాగేంద్ర, కోఆర్డినేటర్ జరిన్ తదితరులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకి.. మదన్ సాయం




వీధి వ్యాపారులకి తోపుడుబండిని అందజేస్తున్న నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి

నెల్లూరులోని 18,19,20 డివిజన్ల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి 19వ డివిజన్‌లోని ఇద్దరు వీధి వ్యాపారస్తుల జీవనోపాధికి సాయంగా ఇటీవల తోపుడుబండ్లు అందజేశారు. రామలింగాపురానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి చికెన్ పకోడా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, ఆయనకి సాయంగా తోపుడు బండిని అందచేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదే విధంగా 19వ డివిజన్‌లోని రమణయ్య దంపతులకు సాయంగా తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 19వ డివిజన్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి - కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల స్ఫూర్తితో ఇప్పటికే 20మంది వీధి వ్యాపారస్తులకు తోపుడు బండ్లు అందించడం జరిగిందన్నారు. ఇంకా 19వ డివిజన్లో మరి కొంత మందికి త్వరలోనే వాటిని అందజేస్తామని తెలిపారు.

# తెలుగుజాతి స్ఫూర్తిప్రదాత!

- పొట్టి శ్రీరాములు జయంతిలో వక్తలు



అమరజీవి చిత్రంతో కూడిన కీచెయిన్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగుజాతికి స్ఫూర్తిప్రదాత అని, తెలుగువారి అభ్యున్నతి కోసం, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన తన అసువులనే అర్పించారని రాష్ట్ర అధికార భాషా సంఘం ఛైర్మన్ త్రివిక్రమరావు చెప్పారు. ఈనెల 17న నెల్లూరులోని డీకేడబ్ల్యు ప్రభుత్వ కళాశాలలో జరిగిన శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు భాషా పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. చెన్నై మైలాపూర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనం నిర్వహణ కమిటీ అధ్యక్షులు.. మన నెల్లూరీయులు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, తెలుగువారి కోసం శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు అనితరసాధ్యమని అన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రంతో కీచెయిన్ నమూనాని వారు ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.గిరి, డా. కరుణశ్రీ, జయప్రకాష్, సమైక్యభారతి రాష్ట్ర అధ్యక్షులు సి.భాస్కరరెడ్డి, జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.




**● శ్రీసిటీ ఎం.డీకి అరుదైన గౌరవం**

### అసోచాం సెజ్- పారిశ్రామిక మండళ్ల

# జాతీయ మండలి ఛైర్మన్‌గా డా. సన్నారెడ్డి



నూతన మండలి సహ-ఛైర్మన్‌లతో శ్రీసిటీ ఎం.డీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి అరుదైన గౌరవం లభించింది. 2026-27 సంవత్సరానికి ఏర్పాటైన భారత వాణిజ్య మరియు పరిశ్రమల సంఘం(అసోచామ్) అనుబంధ సెజ్- పారిశ్రామిక మండళ్ల జాతీయ మండలి ఛైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. గతంలో డా. రవీంద్ర సన్నారెడ్డి అసోచామ్ జాతీయ మండలి ఛైర్మన్‌గా నియమితులై, దాదాపు దశాబ్దం పాటు ఆ పదవిలో కొనసాగారు. 2018లో ఆయన జాతీయ సెజ్ విధాన కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. అదనంగా, 2010లో అసోచామ్ దక్షిణ ప్రాంతీయ మండలి స్థాపక ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి, దాదాపు పది సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు కూడా. తాజాగా ఛైర్మన్‌గా నియమితులవడం పట్ల పరిశ్రమల వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఆ మండలికి సహ-ఛైర్మన్‌లుగా డా. ఎల్.బి.సింఘాల్ (మాజీ నోయిడా సెజ్ కమిషనర్), హితేందర్ మెహతా (సెంట్రం లీగల్ మేనేజింగ్ పార్టనర్) నియమితులయ్యారు. అసోచామ్ అధ్యక్షుడు నిర్మల్ కె.మిందా ఇటీవల ఈ నూతన మండలి ఏర్పాటును ప్రకటించారు. ఈ సందర్భంగా డా. సన్నారెడ్డి మాట్లాడుతూ, సెజ్‌లను పెట్టుబడులు, ఎగుమతులు, పారిశ్రామిక వృద్ధికి చోదకశక్తులుగా నిలబెట్టే దిశగా, ప్రభుత్వం, పరిశ్రమలతో కలిసి మండలి పని చేస్తుందన్నారు. సెజ్ పథకం రెండు దశాబ్దాలు పూర్తిచేసుకున్న ఈ సమయంలో, 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి అనుగుణంగా కొత్త సమన్వయం అవసరమని డా. సింఘాల్ అన్నారు. సెజ్ 2.0 విధాన రూపకల్పనలో ఈ మండలి కీలక పాత్ర పోషిస్తుందని మెహతా పేర్కొన్నారు.

### ఆంధ్రరాష్ట్ర సాధన కోసం..

# ప్రాణాలే అర్పించిన మహనీయుడు!

**- మంత్రి ఆనం**

తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములని, తన ప్రాణాలను పణంగాపెట్టి తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన పోరాట యోధుడు శ్రీరాములని, అమరజీవి త్యాగ నిరతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మార్చి 16న శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటుచేసిన భారీర్యాలీలో ఆయన పాల్గొని, పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మార్గం సుగమం చేసిన దూరదృష్టి గల మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములని కీర్తించారు. అమరజీవి త్యాగాలకు గుర్తుగా అమరావతిలో 58 అడుగుల విగ్రహం, స్మృతి వనాన్ని సీఎం నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఆత్మకూరు పట్టణంలో నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారిపై మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, నందమూరి తారక రామారావు విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుందామని, వారు చూపిన సన్మార్గంలో నడుద్దామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.



శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతరం, ఆత్మకూరు పట్టణానికి చెందిన వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 12మంది ఆర్యవైశ్య ప్రముఖులను సత్కరించారు. ఆనం వెంట ర్యాలీలో ఆత్మకూరు పట్టణ యువత, ఆర్యవైశ్య ప్రముఖులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

**అభివృద్ధే ధ్యేయం :**


ఆత్మకూరు అభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తున్నామని మంత్రి ఆనం తెలిపారు. ఈనెల 16న ఆయన ఆత్మకూరులో అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం ఆకస్మికంగా పలు ప్రాంతాలను పరిశీలించారు. క్రీడా ప్రాంగణం, నగరవనం, బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న క్రీడా ప్రాంగణం విస్తరణ కోసం మరో 10 ఎకరాల అదనపు స్థల సేకరణకు సంబంధించి మంత్రి స్థలాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల శాశ్వత భవనాల నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని గుర్తించేందుకు అధికారులతో కలిసి పరిశీలించారు. మరో ఆరు నెలల్లో ఆత్మకూరుకు అద్భుతమైన రహదారిని అందిస్తామని కూడా మంత్రి ఆనం తెలిపారు.



అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఆనం

# రైతులకు ఆర్థిక భరోసా!

**● 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**




రైతులకి 'అన్నదాత సుఖీభవ' చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, గిరిధర్‌రెడ్డి

రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్ -అన్నదాత సుఖీభవ పథకం రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందని, పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రైతుల అవసరాలకు ప్రభుత్వం నగదును అందిస్తోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. నెల్లూరుజిల్లాలో 1,95,866 మంది రైతుల ఖాతాల్లో రూ.110.97 కోట్లు ప్రభుత్వం జమ చేసేందుకు నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. ఇటీవల నెల్లూరురూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పీఎం కిసాన్ 22వ విడత కింద 1,63,125మంది రైతులకు రూ. 32.63కోట్లు, అలాగే అన్నదాత సుఖీభవ మూడో విడత కింద 1,95,866మంది రైతులకు రూ. 78.35 కోట్లు విడుదలవుతున్నట్లు చెప్పారు. ఈ రెండు పథకాల ద్వారా మొత్తం రూ.110.97 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రస్తుతం పంట కోతల సమయంలో ఈ డబ్బులు రైతులకు ఉపయోగపడతాయని కలెక్టర్ చెప్పారు.

### రైతుల కోసం ప్రత్యేక పాఠశాల.. - బీద రవిచంద్ర

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంపై ప్రత్యేక అధ్యయనం కోసం ఒక ప్రత్యేక పాఠశాలను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరుజిల్లాలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వ్యవసాయ రంగంపై ప్రత్యేకదృష్టి సారించి రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా "ఛాంపియన్ ఫార్మర్" కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకాల మెగా చెక్కులను వారు ఆవిష్కరించారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## హెచ్చరిక నోటీసు

ప్రకాశం జిల్లా, కొండపి మండలం, కె.ఉప్పలపాడు గ్రామ నివాసులు అయిన మా కక్షిదారులు **1. శ్రీ ధాకా లక్ష్మారెడ్డి గారి కుమారుడు శ్రీ ధాకా కోటిరెడ్డి** మరియు **2. శ్రీ ధాకా కోటిరెడ్డి గారి భార్య శ్రీమతి అనూరాధ గారి** సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

మా కక్షిదారులు నందు రెండవ వారైన అనూరాధ గారి అన్నగారైన ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి మరియు సదరు ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి గారి భార్య అయిన శ్రీమతి చిచ్చిలి రజిత గార్లతో మా కక్షిదారులు ఇరువురు కలసి **ది. 17.01.2007 దిన మెసర్స్. "అనిల్‌కుమార్‌రెడ్డి & అసోసియేట్స్"** అను భాగస్వామ్య సంస్థను నెల్లూరు నందు సమనిష్పత్తితో 20 సంవత్సరాల నిర్దిష్ట కాలపరిమితితో ఏర్పాటు చేసుకుని స్థిరాస్థి లావాదేవీలు నిర్వహించుచూ, సదరు భాగస్వామ్య సంస్థ అయిన మెసర్స్. అనిల్‌కుమార్‌రెడ్డి & అసోసియేట్స్ షెడ్యూల్ ఆస్తిని సంస్థ పేరున (1) తే.25.07.2007 దిన శ్రీ సయ్యద్ అబ్దుల్ రహీం వురఫ్ బాషా సాహెబ్ గారి నుండి నెల్లూరు సబ్‌రిజిస్ట్రారు వారి అఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 13716/2007 రు విక్రయ పత్రము ద్వారాను (2) తే.26.07.2007 దిన శ్రీమతి సయ్యద్ షాజహాన్ బేగం మరియు ముగ్గురి నుండి నెల్లూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 13764/2007 రు విక్రయ పత్రము ద్వారా కొనుగోలు చేసిన తదుపరి **అనిల్ గార్డెన్స్** పేరుతో ఫంక్షన్ హాలు ఏర్పాటు చేసి నిర్వహించుచున్నారు. నిర్దిష్ట కాలపరిమితి తరువాత అనగా తే. 16.01.2027ది తరువాత సదరు భాగస్వామ్య సంస్థ రద్దు అగబడును. అప్పటివరకు క్రింది షెడ్యూలు దాఖలా భూమియందు ఏర్పాటు చేసియున్న **అనిల్ గార్డెన్స్** భాగస్వామ్య సంస్థ ఆస్థి అయి వుండి కాలపరిమితి తీరిన తరువాత భాగస్వామ్య సంస్థ రద్దు అయిన తదుపరి క్రింది షెడ్యూలు దాఖలా భూమిపై మరియు అందులో ఏర్పాటు చేసియున్న **అనిల్ గార్డెన్స్**పై భాగస్వాములు అందరికీ సమ నిష్పత్తితో అనగా మా ఒకటి మరియు రెండవ కక్షిదారులు మరియు సదరు అనిల్‌కుమార్, అతని భార్య శ్రీమతి రజిత భాగ పంపిణీ చేసుకొనవలసి ఉన్నది. (1) ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి (2) శ్రీమతి చిచ్చిలి రజిత గారలు భాగస్వామ్య సంస్థకు చెందిన క్రింది షెడ్యూలు దాఖలా భూమిని మరియు అందులో ఏర్పాటు చేసియున్న **అనిల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్** నందు తమకు ఎక్కువ నిష్పత్తి వాటా కలవారమని ఇరువురు నెల్లూరు మొదటి అదనపు జిల్లా కోర్టు యందు సివిల్ **దావా ఓ.యస్.నెం. 87/2018 దాఖలు చేయగా** సదరు వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్నది. మా కక్షిదారులు ఇరువురు భాగస్వామ్య సంస్థ నందు వారి వారి నాల్గవ వంతు వాటాతో సమిష్టిన సగ భాగమునకు హక్కుదారులైయున్నారు. మా కక్షిదారులు ఇరువురు భాగస్వామ్య సంస్థ నందు తమకు హక్కు కలిగియున్న సమిష్టి సగభాగము హక్కును వారి అవసరముల రీత్యా సముచితమైన ప్రతిఫలమునకు చట్టబద్దమైన తగు రీతిన అమ్ముటకు క్రమమైన విక్రయ అగ్రిమెంటుకు ఆసక్తి చూపిన కొనుగోలు దారుతోటి విక్రయ అగ్రిమెంటు ఏర్పాటు చేసుకొనియున్నారు.

కనుక యిందు విషయమై తెలియజేయునది ఏమనగా ఎవ్వరైనా పై చెప్పబడిన ఇస్కా అనిల్‌కుమార్‌రెడ్డి మరియు శ్రీమతి చిచ్చిలి రజిత గారలతో క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి విషయమై వారి సగ భాగము కంటే పెచ్చు ఆస్థికి ఏదైనా లావాదేవీలు జరిపిన ఎడల అట్టి లావాదేవీలు మా కక్షిదారుల సమిష్టి సగ భాగము హక్కును బద్దపరచజాలవు. అలాంటి లావాదేవీలు చట్టబద్ధమైనవి కావు, అని కొనుగోలుదారులు తెలిసి లావాదేవీలు జరిపినట్లుగా భావించబడును. అందు విషయమై వారికి కలిగే కష్టనష్టములకు వారే పూర్తి బాధ్యత వహించగలరు.

**ఆస్థి వివరము**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, నెల్లూరు రి.డి యిలాకా, నెల్లూరు స.రి. యిలాకా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన నెల్లూరు బిట్-1రులోని

పాత సర్వే నెం. 1576/876 (CAS No. 650 య. 4-10 ట్లు)
పాత సర్వే నెం. 1576/870 (CAS No. 650/1 య. 2-88 ట్లు)
పాత సర్వే నెం. 1576/871 (CAS No. 650/2 య. 4-78 ట్లు)
పాత సర్వే నెం. 1570/875 (CAS No. 651 య. 11-88 ట్లులో. య. 6-07 ట్లు)

మొత్తం వెరశి య. 10-17 ట్లులో య. 4-08 1/2 సెంట్లు భూమికి హద్దులు : **తూర్పు** : యితరుల భూమి, **దక్షిణం** : రోడ్డు, **పడమర** : యితరుల భూమి, **ఉత్తరం** : పారుదల కాలువ.

పై హద్దులలోని య. 4-08 1/2 సెంట్లు భూమి, యీ భూమిలో నిర్మించబడియున్న 'అనిల్ గార్డెన్స్' ఫంక్షన్ హాల్ తదితర కట్టడములు, అందుకు సంబంధించిన యావత్తు అమరికలు, పై ఆస్థి నందు సమిష్టిన మా కక్షిదారుల సగ భాగం హక్కు అనగా చెరి నాల్గవ వంతు హక్కు కలిగియున్నారు.

**Inakollu Venkateswarlu,** Advocate, LIGH Colony, Rajapanagal Road, Ongole.
**T. Vijaya Bhaskar Reddy, Ch. SriHari Narayana Rao,** Advocates, Nellore.

# ఎలక్ట్రానిక్స్ రంగాన్ని బలోపేతం చేయండి

**-రాజ్యసభలో బీఎంఆర్**



దేశంలో ఎలక్ట్రానిక్స్ కంపోనెంట్స్ తయారీ పథకం పురోగతి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల సృష్టి మరియు దిగుమతి ఆధారాన్ని తగ్గించే చర్యలపై రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్ ఈనెల 13న రాజ్యసభలో ప్రశ్నించారు. ఈ రంగాన్ని మరింత విస్తరించి యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లు ఏర్పాటు చేసి పెట్టుబడులు ఆకర్షించేలా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అందుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు సమాచార సాంకేతిక శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాదా సమాధానమిస్తూ, "మేక్ ఇన్ ఇండియా" మరియు "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యాల మేరకు దేశంలో సమగ్ర ఎలక్ట్రానిక్స్ తయారీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత 11 సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి విలువ సుమారు 1.9 లక్షల కోట్ల నుంచి 11.3 లక్షల కోట్లకు పెరిగిందని, ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయని వివరించారు.

## ఏపీ టెక్స్‌టైల్ ఎగుమతులకు ప్రోత్సాహం అవసరం

ఆంధ్రప్రదేశ్‌లో హ్యాండ్లూమ్, పవర్‌లూమ్ మరియు టెక్స్‌టైల్ ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు అదేరోజున రాజ్యసభలో ప్రశ్నించారు. కేంద్ర టెక్స్‌టైల్‌శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ అందుకు సమాధానం ఇస్తూ, నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మరియు రా మెటీరియల్ సప్లై స్కీమ్ ద్వారా మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, ధర్మవరం వంటి క్లస్టర్లలో వీవర్లకు ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందని, మొత్తం 38.31 కోట్ల ప్రాజెక్టులో కేంద్ర వాటా 29.97 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.98 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

### కనీసవేతన సలహామండలి

# డైరెక్టర్‌గా..మన్నెం



రాష్ట్ర కనీస వేతన సలహా మండలి డైరెక్టర్‌గా మన్నెం పెంచల నాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను ఆ పదవిలో నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిల ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందని అంటూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# సైనిక సంక్షేమనిధికి విరాళం

నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయం, జిల్లాలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఈనెల 14న సైనిక సంక్షేమ నిధికి లక్షా 9వేల 450 రూపాయలను విరాళంగా ఇచ్చారు. జడ్పీ ఉన్నతాధికారులు ఆమేరకు చెక్కును జిల్లా సైనిక్ అధికారికి అందజేశారు. మనందరి క్షేమం కోసం రాత్రిపగలు శ్రమించే సైనికుల సంక్షేమం కోసం ఎంత చేసినా తక్కువేనని, ప్రతిఒక్కరూ తమవంతు విరాళం అందించాలని వారు కోరారు.

# విదేశీ పర్యాటకులని పెంచాలి

**- లోక్‌సభలో విపిఆర్**



దేశంలో విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నించారు. కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానమిస్తూ, దేశంలో అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు 2024లో 20.57 మిలియన్లకు చేరుకున్నాయనీ, ఇది 2019లో కరోనా మహమ్మారికి ముందు ఉన్న 17.91 మిలియన్ల కంటే అధికమన్నారు. 2019 స్థాయితో పోలిస్తే 2024లో వృద్ధి 14.82 శాతం ఉందన్నారు. దేశంలో అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలకు సంబంధించి బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ వివరాల మేరకు 2024లో 2,05,68,622 మంది ప్రయాణించగా, 2025లో 2,00,85,644 మంది రాకపోకలు సాగించారన్నారు. దేశంలో పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పర్యాటక మంత్రిత్వ శాఖ వివిధ ప్రచార కార్యకలాపాలను చేపడుతోందని, ఆయా దేశాలలో ఉన్న భారతీయ మిషన్లు, రాష్ట్ర ప్రభుత్వాలు-కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనలు మరియు ప్రయాణ వాణిజ్య రంగాలతో కలిసి ఈ కార్యకలాపాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## పీఎం 'అభీమ్'పై..వివరాలు తెలపండి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పీఎం అభీమ్ (ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్) కింద కలిగిన లబ్ధి వివరాలను తెలియజేయాలని వేమిరెడ్డి ఇటీవల లోక్‌సభలో అడిగారు. ఆంధ్రప్రదేశ్ అంతటా, ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో ఉన్న గ్రామీణ ఆరోగ్య, వెల్నెస్ కేంద్రాల వివరాలు కోరారు. వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ సమాధానం ఇచ్చారు. 2021-22 నుండి 2025-26 వరకు పిఎం-అభీమ్ పథకానికి రూ.64,180 కోట్లు కేటాయింపులు జరిగాయన్నారు. ఆరోగ్య కేంద్రాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు సంవత్సరాల కాలానికి రూ.1118.80 కోట్ల మొత్తానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు వివరించారు.

# గూడూరు డివిజన్

# రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్**



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కి స్వాగతం పలుకుతున్న రైతులు, మహిళలు

అన్నదాత సుఖీభవ కార్యక్రమం విజయవంతం అయిందని, 20వేల రూపాయల నగదు రైతుల అకౌంట్లలో జమ చేయడం జరిగిందని, దీంతో వారు ఎంతో సంతోషంగా ఉన్నారని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వెల్లడించారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు తీసుకున్న రైతుల వద్దకు ఎమ్మెల్యే సునీల్ వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా అన్నదాత సుఖీభవ నగదు రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. స్థానికులు కొన్ని సమస్యలు తెలియజేశారని త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, మట్టం మురళి, ఇందుకూరు లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ సేవా సంఘం నుండి సత్కారాన్నందుకుంటున్న డా. సి.రోహిణి

# మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని డాక్టర్ సి.రోహిణి వెల్లడించారు. గూడూరు రెండోపట్టణ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య కళ్యాణ మండపంలో ఇటీవల జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాఖ్య అధ్యక్షులు శివకుమార్ కృషితోనే ఈ కళ్యాణ మండప నిర్మాణం జరిగిందని ఆయనను అభినందించారు. పిల్లలకు చిన్నతనం నుండే విలువలు నేర్పించాలని సూచించారు. మహిళలకు పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పంచాంగ శ్రవణకర్త, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆలూరు శిరోమణిశర్మ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ పుస్తకాలను ఆవిష్కరించారు. శిరోమణిశర్మ మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను భవితరాల వారికి తెలియజేయాలని కోరారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు ఆనిమెళ్ల శివకుమార్, లలితమ్మ, పురుషోత్తం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శిరోమణి శర్మ, డా. రోహిణి తదితరులు

# రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న షేక్ రియాజ్ అహ్మద్

గూడూరు, షాదీ మంజిల్‌లో ఈ నెల 15న మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 170 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ జరుపుకొనేందుకు వీలుగా రంజాన్ తోఫాను పంపిణీ చేయడం జరిగింది. నెట్‌వర్క్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్ షేక్ రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా నెట్‌వర్క్ ద్వారా పేద ముస్లింలకు, విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈరోజు పేద కుటుంబాలకు రంజాన్ కిట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం మైనార్టీ నాయకులు రహీం, దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, ఎంఈఓ రవూపు, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలంటూ భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు గండికోట మధు, గూడూరు సీ.ఐ.టీ.యు అధ్యక్షులు పామంజి మణి ఇటీవల నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించి వాడుకున్నారని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైములును వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎస్.డి.రఫీ, జిలానీ భాషా, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, ఎంబేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజెల్స్ గ్రాడ్యుయేషన్ డే



చిల్లకూరు శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో ఇటీవల యూకేజీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గూడూరు ఈ.ఎస్.ఐ వైద్యాధికారి డాక్టర్ కిషోర్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్, శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనం నుండే ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు నేటి ఆధునిక సమాజంలో ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించేలా ఉపాధ్యాయులు.. విద్యార్థులను ప్రభావితం చేయాలని సూచించారు. అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, పీ.టీ.ఎం కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పోరాడడమే సోమిరెడ్డి నైజం

పనబాక లక్ష్మి

నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం స్ఫూర్తితో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన కార్యక్రమం చేపట్టారని మాజీ కేంద్రమంత్రి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి కొనియాడారు. ఇటీవల ఆమె ఎమ్మెల్యే సోమిరెడ్డితో కలసి సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండలం చెన్నపల్లిపాళెం జడ్పీ హైస్కూలులో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా, లేకున్నా సోమిరెడ్డి పోరాటమే పథంగా ముందుకు సాగుతుంటా రన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ, కృష్ణపట్నం, ముత్తుకూరు పంచాయతీల్లో కృష్ణపట్నం అదానీ పోర్టు కంపెనీ వాళ్లు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, ఇలా అనేక కంపెనీలు తమ సీఎస్‌ఆర్ నిధులతో సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్నాయని తెలిపారు.



విద్యార్థినులకి సైకిళ్ళను పంపిణీ చేస్తున్న సోమిరెడ్డి, పనబాక లక్ష్మి

## మనమే నంబర్.1

- సోమిరెడ్డి

దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం నంబర్.1గా ఉందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. గతంలో వైసీపీ సర్కారు నిర్వీర్యం చేసిన వ్యవసాయ శాఖకు మళ్లీ జీవం పోసి, అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు అండగా నిలుస్తూ ఏడాదికి రూ.3060కోట్ల అదనపు లబ్ధిని అన్నదాతలకు కలుగజేస్తున్నామన్నారు. మండల కేంద్రమైన ముత్తుకూరులో ఇటీవల మూడో విడత అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతన్నల కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి రైతులకు రూ.20 వేలు అందిస్తోందన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే నాలుగేళ్లలో ఈ పథకం కింద రైతులు రూ.82 కోట్లు అదనంగా లబ్ది పొందుతారన్నారు.

### ముంబై ఎగ్జిబిషన్‌లో..

# 'కూల్ సిటీ'గా మెరిసిన శ్రీసిటీ




ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీసిటీ ప్రదర్శన

ముంబైలో ఇటీవల జరిగిన 'ఏసీఆర్ ఇఎక్స్ ఇండియా 2026' ఎగ్జిబిషన్‌లో 'కూల్ సిటీ'గా శ్రీసిటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీసిటీలోని ప్రముఖ ఏసీ కంపెనీలు, ఇతర అనుబంధ పరిశ్రమలు ఈ ప్రదర్శనలో పాల్గొని హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్‌కండిషనింగ్, రిఫ్రిజిరేషన్ తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రాధాన్యతను చాటాయి. దక్షిణఆసియాలోనే ఆ రంగానికి సంబంధించిన ప్రముఖ ఎగ్జిబిషన్‌గా గుర్తింపు పొందిన ఈ ఎగ్జిబిషన్‌ను ఇండియా సొసైటీ ఆఫ్ హీటింగ్, రెఫ్రిజిరేటింగ్ మరియు ఎయిర్ కండిషనింగ్ ఇంజనీర్ అనే సంస్థ నిర్వహిస్తోంది. శ్రీసిటీలో ప్రస్తుతం డైకిన్, ఎల్జి, హావెల్స్, బ్లూస్టార్, అంబర్ ఎంటర్‌ప్రెసెస్, హైసెన్స్, థెర్మాక్స్, క్యారియర్ వంటి ప్రముఖ సంస్థలతో పాటు నైడెక్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్, అదెలా ఎలక్ట్రానిక్స్ సహా మొత్తం 32 విడి భాగాల సరఫరా కంపెనీలు ఏర్పాటై, దేశంలో అతిపెద్ద ఏసీల తయారీ హబ్‌గా మారుతోందని మరోసారి ఈ ఎగ్జిబిషన్ ద్వారా రుజువైంది.

## 'కాకర్ల' పెళ్ళికానుక

ఉదయగిరి మండలం, దాసరపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రబల్లికుంట గ్రామానికి చెందిన గెట్టిబోయిన సురేష్-హజరత్తమ్మ దంపతుల కుమార్తె వెంకట స్వప్న వివాహ సందర్భంగా, ఈనెల 14న ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తమ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరపున పెళ్లి కానుకగా 10 వేల రూపాయలను అందజేశారు. ట్రస్ట్‌సభ్యులు వధువు కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి

కొండాపురం మండలం కొమ్మి పంచా యతీలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి విద్యార్థులకు టీడీపీ నాయకులు అంబటి సురేంద్ర ఆధ్వర్యంలో 40 మందికి పరీక్ష సామాగ్రి పంపిణీచేశారు.



# యుద్ధ ఉగాది



- చిన్ని నారాయణరావు
సెల్. 94402 02942

ఇక్కడ -
రోడ్లు రక్తం కక్కుకుంటున్నాయి
స్నానించడానికి నీళ్ళు లేవు కానీ
రక్తం ఏరులై పారుతోంది
అగ్నిజ్వాలల్లో భవనాలు పేకమేడ
లవుతున్నాయి.

మృత్యువు వీధుల్లో నృత్యం చేస్తున్నది
కేబరే ఆడుతున్నది
బడి, తల్లి కంటిపాప అనుకొన్నాం
గాని అభద్రతావలయం అనుకోలేదు
విధ్వంసం పసిపాపల
నుంచే ప్రారంభం కావడం పెద్ద 'పరాభవం'

కాలిపోయిన కలల అజెండాతో
నగరాలు భీభత్సమై
అగ్నిగోళాల్లా జీవితాలు బ్రద్దలవుతున్నాయి.
ఏ కుటుంబంపై ఎప్పుడు మిసైళ్ళు
కురుస్తాయో -
ఏ నీడ పడగనీడగా మారి బాంబులతో
దద్దరిల్లిపోతుందో

తెలిసేదెవరికి?
మూర్ఖులు... యుద్ధోన్మాదులై
పోటీపడి పోటెత్తుతుంటే
సామాన్యుడు బిక్కుబిక్కుమంటూ
బ్రతుకు భయంతో రగిలి
వేడెక్కిపోతున్నాడు
దేశాలకు దేశాలే తగలబడే
దురదృష్టం వెంటాడే వేళ
ఇపుడొస్తున్నావా 'ఉగాదీ'
నీకు హారతులిచ్చే సమయం ఇది కాదు

భయోద్విగ్న సమయంలో
నువ్వు అర్జెంటుగా బంకర్‌ను
వెదుక్కొని విశ్రమించు
ప్రపంచంలో ఉగాదుల్ని
ఉషస్సుల్నీ కలిచి తొలిచే
ట్రంపుల మోత తగ్గగానే
మమ్మల్ని పరామర్శిద్దువుగాని
అప్పుడే నీకు సపర్యలు చేస్తాం
నీ పరాభవాన్ని వైభవంగా
మార్చుకొంటాం... అప్పటిదాకా
కాస్తంత ఓపిక పట్టు ఉగాదీ!

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

విద్యార్థి జీవితంలో ఆత్మవిశ్వాసం అనేది పుస్తకాలలో దొరికే పాఠం కాదు.. అది మనసులో పెరిగే శక్తి. చదువు, పరీక్షలు, పోటీలు, భవిష్యత్తు. ఈ నాలుగు దారుల్లో నడిచే ప్రతి విద్యార్థికి ఆత్మవిశ్వాసం ఒక దీప స్తంభం. "నమ్మకం ఉన్నవాడికి నడకలోనే గెలుపు కనిపిస్తుంది" అని పెద్దలు చెప్పిన మాట చదువులో మరింత నిజం. ఆత్మవిశ్వాసం ఉన్న విద్యార్థి తప్పులు చేసినా నేర్చుకుంటాడు; ఆత్మవిశ్వాసం లేని విద్యార్థి నేర్చుకున్నదాన్నే సందేహిస్తాడు. అందుకే ఆత్మవిశ్వాసం పెంపొందించడం చదువులో మొదటి అడుగు, చివరి బలం.

ఆత్మవిశ్వాసం పుట్టుకతో రాదు; అది అలవాట్లతో పెరుగుతుంది. చిన్న విజయాలను గుర్తించి మనసులో నిలుపుకోవడం ఆత్మవిశ్వాసానికి మొదటి మెట్టు. ఒక చిన్న సమస్యను పరిష్కరించినా, ఒక పాఠాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నా, ఒక రోజు చదువు పథకాన్ని పాటించినా, ఇవి అన్నీ మనసులో' 'నేను చేయగలను" అనే భావాన్ని నాటుతాయి. "చిన్నది చిన్నదే, కానీ చినుకు చినుకు చేరి చెరువు అవుతుంది" అనే లోకోక్తి విద్యార్థి జీవితానికి అచ్చం సరిపోతుంది. చిన్న విజయాలను గౌరవించే విద్యార్థి పెద్ద విజయాలకు సిద్ధమవుతాడు. ఆత్మవిశ్వాసం పెరగాలంటే మొదట మన బలాలను గుర్తించాలి. ప్రతి విద్యార్థికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఎవరికి గణితం బలం, ఎవరికి భాషా నైపుణ్యం, ఎవరికి జ్ఞాపకశక్తి, ఎవరికి విశ్లేషణా శక్తి..ఎవరి శక్తి వారిది. మన బలాన్ని గుర్తించడం అంటే మనసుకు అద్దం పట్టినట్టే. 'తన బలం తెలిసినవాడు యుద్ధంలో ఓడడు' అనే మాట చదువులో కూడా వర్తిస్తుంది. మన బలం ఏదో తెలుసుకున్నప్పుడు, మనం ఏ దారిలో ముందుకు వెళ్లాలో స్పష్టమవుతుంది. అలాగే, ఆత్మవిశ్వాసం పెరగాలంటే మన బలహీనతలను కూడా అంగీకరించాలి. బలహీనతలను దాచడం కాదు; వాటిని ఎదుర్కోవడం నిజమైన ధైర్యం. గణితం బలహీనమైతే అదనపు సమయం పెట్టాలి, భాష బలహీనమైతే ఎక్కువగా చదవాలి, జ్ఞాపకశక్తి బలహీనమైతే పునర్విమర్శ పద్ధతులు మార్చాలి. బలహీనతలను అంగీకరించడం ఆత్మవిశ్వాసాన్ని తగ్గించదు; అది దాన్ని మరింత బలపరుస్తుంది.

### ఒక్కొక్క మెట్టూ అధిగమించాలి :

ఆత్మవిశ్వాసం పెరగడానికి చదువు పద్ధతి కూడా ముఖ్యమే. చదివినది అర్థం కాకపోతే సందేహాలు పెరుగుతాయి; సందేహాలు పెరిగితే ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. అందుకే చదువును చిన్న చిన్న భాగాలుగా విభజించి, ఒక్కో భాగాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. "ఒక్కొక్క అడుగు వేసినవాడే శిఖరాన్ని చేరతాడు" అనే లోకోక్తి చదువులో అక్షరాలా నిజం. పెద్ద పాఠాన్ని ఒకేసారి చదవడం కంటే, చిన్న భాగాలను అర్థం చేసుకుంటూ చదవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆత్మవిశ్వాసం పెరగడానికి మరో ముఖ్యమైన అంశం.. స్వీయసంభాషణ. మనం మనతో మాట్లాడే మాటలు మన మనసును తీర్చిదిద్దుతాయి. "నేను చేయలేను"అనే మాట మనసును బలహీనపరుస్తుంది; "నేను ప్రయత్నిస్తాను" అనే మాట మనసును బలపరుస్తుంది. "మనసే మనిషిని మలుస్తుంది" అనే లోకోక్తి. ప్రతిరోజూ మనసులో "నేను నేర్చుకుంటున్నాను", "నేను ముందుకు వెళ్తున్నాను", "నేను చేయగలను" అనే మాటలు చెప్పుకోవడం ఆత్మవిశ్వాసానికి బలమైన పునాది.

### భయం కాదు.. సన్నద్ధత ముఖ్యం :

పరీక్షల సమయంలో ఆత్మవిశ్వాసం తగ్గిపోవడానికి ప్రధాన కారణం భయం. పాఠం పూర్తిగా అర్థం కాకపోతే భయం పెరుగుతుంది; పునర్విమర్శ చేయకపోతే భయం రెట్టింపు అవుతుంది. అందుకే పరీక్షలకు ముందే పునర్విమర్శ పథకాన్ని సిద్ధం చేసుకోవాలి. 'సిద్ధమైనవాడికి యుద్ధం భయం కాదు'. సిద్ధత ఉన్న చోట భయం ఉండదు; భయం లేని చోట ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అదేవిధంగా, ఆత్మవిశ్వాసం పెరగడానికి శరీర-మనసు ఆరోగ్యం కూడా ముఖ్యమే. నిద్ర సరిపోక పోతే, ఆహారం సరిగా లేకపోతే, శరీరం అలసిపోయి ఉంటే మనసు బలహీనపడుతుంది. అలసిన మనసులో ఆత్మవిశ్వాసం పెరగదు. "ఆరోగ్యం ఉన్నవాడే ప్రపంచాన్ని జయిస్తాడు". రోజుకు కొంత సమయం నడక, వ్యాయామం, శ్వాసాభ్యాసం.. ఇవి మనసును ప్రశాంతంగా ఉంచి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఆత్మవిశ్వాసం పెరగడానికి మరో శక్తివంతమైన పద్ధతి.. సానుకూల వాతావరణం. మనచుట్టూ ఉన్నవారి మాటలు, వారి ప్రోత్సాహం, వారి దృక్పథం మన మనసును ప్రభావితం చేస్తాయి. "ఎవరితో ఉంటే అలాంటి వాడవుతావు" అనే లోకోక్తి చదువులో కూడా నిజమే. ప్రోత్సాహించే స్నేహితులు, మార్గనిర్దేశం చేసే పెద్దలు, సానుకూల వాతావరణం.. ఇవి విద్యార్థి ఆత్మవిశ్వాసానికి బలమైన ఆధారం.

ఆత్మవిశ్వాసం పెరగడానికి చివరిగా ఒక ముఖ్యమైన విషయం.. తప్పులను చూసి భయపడకండి. తప్పు చేసినప్పుడు మనసులో భయం కాకుండా, "ఇది నాకు నేర్పింది ఏమిటి?" అనే ప్రశ్న రావాలి. ఈ ప్రశ్న ఆత్మవిశ్వాసాన్ని తగ్గించదు; దాన్ని మరింత బలపరుస్తుంది. ఆత్మవిశ్వాసమంటే.. ప్రతిరోజూ చేసే చిన్న చిన్న ప్రయత్నాల ఫలితం. చిన్న విజయాలను గుర్తించడం, బలాలను అంగీకరించడం, బలహీనతలను ఎదుర్కోవడం, పద్ధతిగా చదవడం, సానుకూలంగా ఆలోచించడం, భయాన్ని జయించడం-ఈ ఆరు దారులు కలిసి ఆత్మవిశ్వాసాన్ని నిర్మిస్తాయి. "నమ్మకం ఉన్నవాడికి దారి దొరుకుతుంది".. అనేది నూటికి నూరుపాళ్లు వాస్తవం!..

**వచ్చే వారం:** విద్యా విజయానికి ఇంగ్లీష్‌లో నైపుణ్యం - విద్యార్థి జీవితాన్ని మార్చే శక్తి!



E-mail: reddyu@gmail.com

# ఉగాది పురస్కారాలందుకున్న మన నెల్లూరీయులు



ముఖ్యమంత్రి చేతులమీదుగా ఉగాది పురస్కారాలందుకుంటున్న రావి మోహన్‌చౌదరి, కోసూరు రత్నం



వీఎస్ సుందరం

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది (మార్చి 19) రోజున రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్న నెల్లూరీయులలో సాహితీవిభాగం నుంచి రాళ్లపల్లి వీఎస్ సుందరం 'కళారత్న' (హంస) పురస్కారాన్ని అందుకున్నారు.

**సమాజసేవా విభాగంలో..** ఉగాది పురస్కారాలలో సామాజిక సేవా విభాగంలో కర్ణాటక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్తగా పార్టీ పటిష్టతకు పాటుపడడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు సేవలందించిన నెల్లూరుజిల్లాకి చెందిన రావి మోహన్‌చౌదరి కూడా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఇదే విభాగంలో కొండూరు హరినారాయణరెడ్డి, కోసూరు రత్నంలు కూడా పురస్కారంతో పాటు 10వేల నగదు, శాలువ, జ్ఞాపికలను ముఖ్యమంత్రి నుంచి అందుకున్నారు.

# స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలి

## డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్ డా. సతీష్‌రెడ్డి




కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడుని సత్కరిస్తున్న సతీష్‌రెడ్డి

స్వదేశీ సాంకేతికతను సత్వరం అభివృద్ధి చేసుకోవాలని, దేశంలోని విద్యా సంస్థలు మరియు పరిశ్రమలు ఏరోస్పేస్ రంగంలో పరిశోధనల దిశగా ముందడుగు వేయాలని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్ మరియు ప్రస్తుత ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. తద్వారా డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం కలలుగన్న 'వికసిత భారత్' సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ద్వారా దేశీయ యువశాస్త్రవేత్తలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సతీష్ రెడ్డి నేతృత్వంలో, ఇటీవల న్యూ ఢిల్లీలోని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, విదేశీ పరిజ్ఞానంపై ఆధారపడకుండా సొంతంగా ఏరోస్పేస్ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు మరియు నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వి.కే. సరస్వత్ మాట్లాడుతూ డాక్టర్ కలాం స్ఫూర్తి కొనసాగింపుగా యువశాస్త్రవేత్తలను పోషించడంలో డాక్టర్ సతీష్‌రెడ్డి చేస్తున్న కృషిని కొనియాడారు.

## తెలుగు అధ్యయన కేంద్రానికి..

# నిధులు సమకూరుస్తాం!

వెంకటాచలంలో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి శాశ్వత భవనం మంజూరు చేయిస్తామని, అవసరమైన నిధులు సమకూర్చేందుకు కూడా సహకరిస్తామని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 18న ఆ కేంద్రంలో జరిగిన శతాధిక జాతీయ ఉగాది కవిసమ్మేళనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కవులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెద్దాయన.. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవతోనే ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం మైసూరు నుంచి నెల్లూరుకు వచ్చిందని, 5.50 ఎకరాల భూమిని యర్రగుంట సమీపంలో ఈ కేంద్రానికి వెంకయ్యనాయుడు కేటాయింపజేశారని గుర్తు చేశారు. ఈ కేంద్రం నూతన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ప్రయత్నిస్తామని, ఒకవేళ ఆలస్యమైన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కేంద్రం సంచాలకులు.. ప్రముఖ సారస్వతవేత్త ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సారథ్యంలో జరిగిన ఈ కవిసమ్మేళ నంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన అనేకమంది కవులు పాల్గొనడం విశేషమని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఎమ్మెల్యేని మాడభూషివారు సన్మానించారు.

**ఉగాది కవిసమ్మేళనంలో.. ఎమ్మెల్యే సోమిరెడ్డి**




సోమిరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మాడభూషి సంపత్‌కుమార్

# పేదల 'కంటి వెలుగు'గా.. నారాయణ 'నేత్ర జ్యోతి'



నేత్ర రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ నేతృత్వంలో నెల్లూరు నగరంలో ప్రారంభమైన 'నేత్ర జ్యోతి', ఉచిత అద్దాలు పంపిణీ కార్యక్రమాలు ఎంతోమంది పేదలకు ఉపయోగపడుతున్నాయి. ఈనెల 18న నెల్లూరులోని 40వ డివిజన్ మూలాపేటలోని కొండదిబ్బ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించిన డిప్యూటి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, ఈ నేత్రజ్యోతి కార్యక్రమంలో 10 రోజుల్లోనే 1100 మందికి పైగా రోగులకు కంటిపరీక్షలు చేశారని, 586 మందికి ఉచితంగా కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. వారిలో శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన 39 మందిని నారాయణ వైద్యకళాశాల సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలించి, ఉచితంగా ఆపరేషన్లు పూర్తి చేసి, తిరిగి సురక్షితంగా ఇంటి వద్ద దించి మందులను కూడా అందజేస్తారన్నారు. పేదవారి జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పేదలు నివసించే ప్రతీ ప్రాంతానికి చేర్చాలని మంత్రి నారాయణ చేస్తున్న కృషి అపూర్వమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యకళాశాల కంటివైద్య నిపుణులు డాక్టర్ ఉమా, డాక్టర్ జ్యోత్స్న, దంత వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్, డాక్టర్ దివ్య, డాక్టర్ లోహిత, 40వ డివిజన్ అధ్యక్షుడు గండవరపు నాని తదితరులు పాల్గొన్నారు.

# నేదురుమల్లి ఇంట.. ఉగాది పండుగ




అన్నప్రసాదం పంచుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఉగాది సందర్భంగా ఈనెల 19న వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెంకటగిరిలోని తమ నివాసంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఉగాది మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. అందరికీ ఉగాది పచ్చడి పంచుతూ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో వెంకటగిరి పట్టణ, రూరల్, డక్కిలి బాలాయపల్లి, రాపూరు, సైదాపురం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అమరావతిలో.. 'అమరజీవి'

***ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన మహనీయుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని అమరావతిలో నెలకొల్పడం ఆంధ్ర రాష్ట్రానికీ, తెలుగు ప్రజలందరికీ గర్వకారణం. శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహారదీక్షకు గుర్తుగా.. 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని నిర్మాణం గావించడం, ఆ మహనీయుని ఆత్మబలిదానానికి గుర్తుగా ఆ విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నామకరణం చేయడం విశేషం! శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా మార్చి 16వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం, ఆర్యవైశ్య సోదరులు సంయుక్తంగా అమరావతిలో అమరజీవి విగ్రహాన్ని నెలకొల్పి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చేతులమీదుగా ఆవిష్కరింపజేయడం హర్షదాయకం.***

అమరజీవికి ఎత్తయిన విగ్రహం నెలకొల్పి భావితరాలకు స్ఫూర్తిని కలిగించాలనే ప్రభుత్వ ప్రయత్నం, ఆర్యవైశ్యుల కృషి..అమరావతిలో ఇప్పుడు నిలువెత్తు విగ్రహమై అందరినీ ఆకట్టుకుంటోంది. శ్రీ పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసిన 58 రోజులకు గుర్తుగా, 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పడం, పీఠంతో కలిపి మొత్తం 106 అడుగుల ఎత్తుతో నిర్మాణం జరగడం, అక్కడి నుంచి చూస్తే అమరావతి నగరమంతా నేత్రపర్వంగా కనిపిస్తూ ఉండడం తెలుగువారందరి మనుసులు ఆనందడోలికలూగే దృశ్యమని చెప్పక తప్పదు. ఈ విగ్రహం కోసం 26 టన్నుల కాంస్యం, 42 టన్నుల ఇనుమును ఉపయోగించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ తరఫున విగ్రహం ఏర్పాటుకు విరాళాలు సేకరించి, భారీ వ్యయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఆ విగ్రహాన్ని చూస్తే.. పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాలు, ఆయన ఆత్మబలిదానం..అనితరసాధ్యమైన త్యాగం అన్నీ గుర్తుకు వచ్చేవిధంగా, అజరామరమైన ఆయన కీర్తికే కిరీటంగా విగ్రహ నిర్మాణం గావించిన ఆర్యవైశ్యులు ధన్యులు!.. అందుకు అన్నివిధాలా తోడ్పాటునందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు!.. ప్రత్యేకించి స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆయన నివసించి, దేశస్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన జిల్లా..ఆయనకెంతో ప్రీతిపాత్రమైన జిల్లా కూడా నెల్లూరే. అందుకే, ఆయన పేరుమీదనే నెల్లూరు జిల్లా.. 'శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా'గా అవతరించింది. ఆ త్యాగధనుని కీర్తిచంద్రికలతో ఈ జిల్లా కూడా మరింతగా ప్రకాశమానమవుతోంది.





మొల్లమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమశాఖ అధికారులు

# మొల్లమ్మ జయంతి

తెలుగులో రామాయణాన్ని సరళసుందరంగా రచించిన 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి వేడుక ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి విజయకుమార్ పాల్గొని, మొల్లమ్మ చిత్రపటానికి పూలమాల సమర్పించి. ఆమె సాహితీసేవలను స్మరించుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పి.వెంకటలక్ష్మి, జడ్పీ మాజీ ఛైర్మెన్ చంచలబాబు యాదవ్, బీసీ నాయకులు నాగశేషయ్య, పోట్లదుర్తి బుజ్జయ్య, బుధవారపు బాలాజీ, పెళ్ళూరి శ్రీనివాసులు, డిఆర్ ఇందిర, పద్మజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'పెరసం' సత్కారాలు



సత్కారాలందుకున్న కవులు, కవయిత్రులు

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 15న శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు, పలువురికి సత్కారాలు జరిగాయి. కవయిత్రి తోట సులోచన తమ తల్లితండ్రులు తోట గురుమూర్తి-లక్ష్మమ్మల స్మారకంగా ఉగాది పురస్కారాలు, సత్కారాలు నిర్వహించారు. స్థానిక నెల్లూరు హాస్పిటల్‌లోని సెమినార్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు-కవయిత్రులు షేక్ షంషుద్దీన్, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, దుప్పటి రమేష్‌బాబు, ముసునూరు నారాయణ, అరుణ సందడి తదితరులకు పురస్కారాలను ప్రదానం చేశారు. పెరసం అధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా 'పెన్నా ప్రవాహం' పేరుతో రానున్న మాసపత్రిక బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పెరసం ప్రధాన కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, కోశాధికారి అన్నం శివకృష్ణ, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు, పెరసం వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచల నరసింహం, హస్తి లక్ష్మణ్‌రాజు, పార్లపల్లి నాగేశ్వరి, గాయత్రి, మునీంద్ర, అంకబాబు, ప్రేమ్‌సాగర్, గండికోట సుధీర్, రవి కుమార్, నరసింహమూర్తి, జయలక్ష్మి, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో అనేక మంది కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు.

# రక్తదాన శిబిరం




రక్తదానం చేస్తున్న కాలనీ వాసులు

నెల్లూరు వేదాయపాలెంలోని చైతన్యపురి పార్క్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈనెల15న రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉపాధ్యాయుడు కొండూరు సుబ్బారావు నేతృత్వంలో, రెడ్‌క్రాస్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ కాలనీవాసులు పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ చమర్తి జనార్దన్ రాజు రక్తదాతలను అభినందించారు. కార్పొరేటర్ చెక్కా అహల్య-సాయి సునీల్, డాక్టర్ జి.దయాకర్‌రావు, వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షులు నసీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు, బీవీనగర్ రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలకు వస్త్రదానం

రంజాన్‌ని పురస్కరించుకుని సీనియర్ టీడీపీ నేత మరియు మాజీ కౌన్సిలర్ షేక్ బాషా తన సొంత నిధులతో సుమారు 100 మంది కార్మికులకు పురుషులకు ప్యాంట్, షర్ట్‌లకు సరిపడా వస్త్రాలు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

# అందరికీ అండగా ఉంటాం..

## మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



ముస్లిం మహిళలకి రంజాన్ తోఫా కిట్‌లని అందజేస్తున్న పొంగూరు రమాదేవి

నెల్లూరు నగర నియోజకవర్గంలోని ముస్లిం మహిళా కార్యకర్తలకు అండగా నిలుస్తూ రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఇటీవల 'రంజాన్ తోఫా' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోమతి నగర్‌లోని మంత్రి కార్యాలయంలో ముస్లిం సోదరీమణులతో కలిసి దువా నిర్వహించారు. రంజాన్ సందర్భంగా ప్రతీ ఏటా ముస్లిం సోదరీమణులతో కలిసి ప్రార్థనలు నిర్వహిస్తున్నామని, మూడేళ్ళుగా రంజాన్ తోఫా అందచేస్తున్నామని ఆమె తెలిపారు. అందరికీ తాము అండగా ఉంటామని, మంత్రి నారాయణ తన సొంత నిధులతో ఏడాదికి 10 కోట్ల రూపాయలను కార్యకర్తల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నారని ఆమె తెలిపారు. ముస్లింల ఆత్మగౌరవం కోసం షాదీమంజిల్ నిర్మాణానికి రూ. 50లక్షల భారీవిరాళం ఇవ్వటమే కాకుండా, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే మంత్రి నారాయణ లక్ష్యమని తెలిపారు. నగర మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేతరెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, జిల్లా మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు గునుకుల విజయలక్ష్మి పాల్గొన్నారు.

# వేడుకగా..త్యాగరాజ ఉత్సవాలు



ఎస్.పి.శైలజతో శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ ఉత్సవాల నిర్వాహకులు

నెల్లూరులో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు 61వ శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు వేడుకగా జరిగాయి. త్యాగరాజ ఉత్సవాలను ఒక పండుగలా నిర్వహిస్తూ, నెల్లూరును మరో తిరువయ్యార్ అనిపిస్తూ ఈ ఉత్సవాలు నెల్లూరుకే ఒక ప్రత్యేకతను సంతరించి పెట్టాయి. త్యాగరాజస్వామి భక్తులు..స్వర్గీయ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, డాక్టర్ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిలు 60 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ ఉత్సవాలు నేటికీ అద్వితీయంగా జరుగుతుండడం విశేషం. నెల్లూరు నగరంలో భిక్షాటన చేసి మరీ ఈ ఉత్సవాలు నిర్వహిస్తుండడం తొలినుంచి వస్తున్న ఆనవాయితీ. భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో, స్థానిక టౌన్‌హాల్‌లో జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు. ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, మరెందరో గాయకులు, గానకళాభిమానులు పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వాహకులు యనమండ్ర నాగదేవిప్రసాద్ ఆధ్వర్యంలో, కమిటీ ముఖ్యుల పర్యవేక్షణలో సభా కార్యక్రమాలు ఆద్యంతం వైభవోపేతంగా సాగాయి. చెన్నైకి చెందిన వి.దీపిక, వి.నందిక గాత్ర కచేరీతో పాటు ఆర్.సాయి విఘ్నేష్, మాళవికా సుందర్, ఆర్‌పి శ్రవణ్, రంజని శివకుమార్, కున్నక్కుడి బాలమురళీకృష్ణ తదితరుల గానమాధుర్యాలతో పాటు, ఆర్.కుమరేష్ వయొలిన్ కచ్చేరీ, ప్రముఖ హరికథా కళాకారుడు డా.ముప్పవరపు వేంకటసింహాచలశాస్త్రి భాగవతార్‌ల హరికథాగానం తదితర కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# అలరించిన అష్టావధానం



సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు సమర్పిస్తున్న నిర్వాహకులు

ప్రముఖ రచయిత్రి గోవిందరాజు సీతాదేవి స్మృత్యం కంగా, ఆమె కుమార్తె గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ఈ నెల 17న శతావధాని కొండెపి మురళీకృష్ణ సారధ్యంలో జరిగిన అష్టావధానం అందరినీ అలరించింది. నెల్లూరులోని టౌన్‌హాల్ రీడింగ్‌రూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ ఆశు కవితా ధారణా ప్రతిభ శ్రోతలను ముగ్ధులను చేసింది. శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రజలందరికీ శుభాలు చేకూర్చాలని అవధాని ఆకాంక్షిస్తూ పద్యాలతో నూతన ఉగాది విశేషాలను తెలియజేశారు. పృచ్ఛకులుగా ప్రముఖ సాహితీవేత్తలు సూరం చంద్రశేఖరం, అగస్త్యరాజు సుబ్బారావు, పోలవరపు లక్ష్మీనరసింహారావు, కోట శ్రీరామమూర్తి, గోవిందరాజు సుభద్రాదేవి, పేరిసెట్ల శివకుమార్, డా. గిరిజాలక్ష్మి పాల్గొన్నారు. డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు అప్రస్తుత ప్రసంగాన్ని హాస్యరసస్ఫోరకంగా నిర్వహించారు. తొలుత, సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి అవధాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం అవధానిని, పృచ్ఛకులను నిర్వాహకురాలు సుభద్రాదేవి సన్మానించారు.

# టూకీగా...



## తలమంచిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

కొడవలూరు మండలం తలమంచి సొసైటీలో ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు పి.సూర్యనారాయణ మాట్లాడుతూ, రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ డైరెక్టర్ ఎన్. రవి, మాజీ సర్పంచ్ యరబోలు సుబ్రహ్మణ్యం, సిఇఓ పరమేశ్వర్, వీఏఏ షేక్ షబీనా పాల్గొన్నారు.

## బండ్లపాళెంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ముత్తుకూరు మండలం పల్లూరు పంచాయతీపరిధిలోని బండ్లపాళెంలో ఇటీవల కేంద్రప్రభుత్వ పథకం ద్వారా 24 మంది లబ్దిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శ్రీనాథ్, శివయ్య, శ్రీహరి పర్యవేక్షించారు.

## ఆత్మకూరులో దివ్యాంగురాలికి సాయం

ఆత్మకూరులోని 15వ వార్డుకు చెందిన ఓ దివ్యాంగురాలికి డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సాయం అందజేశారు. డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ ఆ దివ్యాంగురాలికి అవసరమైన నిత్యావసర సరుకులను ఇచ్చారు. ట్రస్టు సభ్యులు టి.అశోక్, షాహిద్దీన్, రహీం, అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ పాల్గొని ఆ సాయం ఆమెకి అందజేశారు.

## మహిమలూరులో క్యాన్సర్ నివారణకు టీకా

ఆత్మకూరు మండలం మహిమలూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇటీవల క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దేవానంద్, డాక్టర్ స్వప్నరెడ్డి ఆధ్వర్యంలో 14 ఏళ్ళు పూర్తయిన బాలికలకు ఈ కేంద్రంలో టీకాలు వేశారు. రామస్వామిపల్లి సర్పంచ్ రమణమ్మ, సీహెచ్‌ఓ సౌందర్య, పీహెచ్‌ఎస్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## కలిగిరిలో..'రైతన్నా నీకోసం' కార్యక్రమం

మండల కేంద్రమైన కలిగిరిలో రైతులకు ఈనెల 17న వ్యవసాయాధికారులు 'రైతన్నా నీకోసం' కరపత్రాలను పంపిణీ చేశారు. రైతన్న సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వివరాలను వారికి తెలియజేశారు. వ్యవసాయంలో మెళకువలను కూడా రైతులకు వివరించారు. మండల వ్యవసాయ కేంద్రంలో ఏడీఏ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## చిన్న అన్నలూరులో వాహనదారులకు జాగ్రత్తలు

కలిగిరి మండలంలోని చిన్న అన్నలూరు గ్రామంలో వాహనదారుల భద్రతకు పోలీసులు అవగాహన కలిగించారు. సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ, వాహనాలు నడిపే టప్పుడు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని హెచ్చరించారు.

## కోవూరులో రేషన్ డీలర్లతో సమావేశం

కోవూరు మండలంలోని గ్రామాల్లో ఉన్న రేషన్ డీలర్లతో తహశీల్దార్ సుబ్బయ్య ఈనెల 17న సమావేశం పెట్టి, రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీచేయాలని, ప్రభుత్వం సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రేషన్ డీలర్ల నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంటలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

బోగోలు మండలం కొండబిట్రగుంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 17న పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ ఎం.ప్రసాదరావు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రను ఎంఇఓ జయమ్మ ప్రారంభించారు. పాఠశాల హెడ్మాస్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ దాత.. కేజేఆర్వీఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సంజయ్ రవి వారిని అభినందించారు.

## వెంకటాచలంలో సర్పంచ్‌లకు శిక్షణ

వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17న ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ కల్పన, ఈఓపీఆర్డీ ముషీధర్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# మిత్రమా..

# నీకు నా అభినందనలు!






సమయపాలన, అంకితభావం, కష్టపడే తత్వం,
పట్టుదల వంటి అన్ని మంచి లక్షణాలకి నిలువెత్తు సాక్ష్యంగా,
విజయాలే లక్ష్యంగా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ..

ఆధ్యాత్మిక తత్పరతకి చిరునామాగా, మంచికి
మానవీయతకి మారుపేరుగా, సేవాతత్వానికి మార్గదర్శకంగా,
స్నేహతత్వానికి ప్రతిరూపంగా ప్రశంసలందుకుంటూ...

కర్ణుడికి కవచకుండలాలులాగా ఆత్మీయత, ఆప్యాయత, విధేయత,
పెద్దలని గౌరవించే సంస్కారంతో ఆపన్నులని ఆదుకునే వ్యక్తిత్వంతో,
మంచి మనసున్న వ్యక్తిగా పేరు తెచ్చుకుంటూ...
నీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న

## డాక్టర్ మహేష్

అసాధారణమైన నీ ప్రతిభకి గుర్తుగా, నీ విజయాలకి సత్కారంగా
105 సంవత్సరాల చరిత్ర కలిగిన పూణెలోని ప్రతిష్టాత్మక
విశ్వవిద్యాలయం 'తిలక్ మహారాష్ట్ర విద్యాపీఠ్' వారు అందించిన
గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకుని సమాజంలో
విశిష్ట స్థానాన్ని పొందిన సందర్భంగా
నీకు నా అభినందనలు.



నీ శ్రేయోభిలాషి...

**మనోజ్ నంబూరు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com